తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక
ఫిబ్రవరి 2016
వెల రూ.5/-



శ్రీనివాసమంగాపురం
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
2016 ఫిబ్రవరి 27 నుండి మార్చి 06 వరకు



శ్రీవారి దర్శనార్థం
భారత రాష్ట్రపతి
డా॥ ప్రణబ్ ముఖర్జీ గారు
25-12-2015 న
తిరుమలకు విచ్చేశారు





స్వాగతం పలుకుతున్న తి.తి.దే. అధ్యక్షులు



వీడ్కోలు పలుకుతున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి



శ్రీవారి ఆలయంలో భారత రాష్ట్రపతి



తి.తి.దే. ఉన్నతాధికారుల నుంచి శ్రీవారిచిత్రపటాన్ని స్వీకరిస్తున్న భారత రాష్ట్రపతి





పశ్చిమగోదావరి జిల్లా ఐ భీమవరం లో తి.తి.దే. వేదపాఠశాలను ప్రారంభించి, వేదవిద్యార్థులను అభినందిస్తున్న భారత రాష్ట్రపతి


కంటిరా వింటిరా కమలనాభునిశ క్తి
వొంటి నితనిశరణ మొకటే వుపాయము ॥పల్లవి॥

యీతనినాభిఁ బొడమె యెక్కువైనబ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁ డాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁ డే పో హరి మనకిందరికి దైవము ॥కంటి॥

యీతఁడే యసురబాధ లిన్నియుఁ బరిహరించె -
నీతనిమూఁడడుగులే యీలోకాలు
యీతఁడే మూలమంటేనే తెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లిఁక మరి కలరా ॥కంటి॥

యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ -
డీతఁడే వేదో క్తదైవ మిన్నిటాఁ దానె
యీతఁడే అంతర్యామి యీ చరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁ డిహపరధనము ॥కంటి॥

(సంపుటం.2,
సంకీర్తన-470)





ఓ జనులారా ! కమలము గర్భమందు గల ఈ శ్రీనివాసుని శక్తిని ఎప్పుడైనా విన్నారా? లేక కన్నారా? మోక్షాన్ని పొందడానికి ఇతని శరణాగతి ఒక్కటే ఉపాయం. నాల్గు మోములు గల బ్రహ్మ ఇతని నాభిలో పుట్టాడు. ఇంద్రుడు మొదలుగా గల దేవతలను ఇతడే కాపాడాడు. ప్రళయ సమయంలో మర్రి ఆకుపై తేలిన దైవము. రాక్షసుల వల్ల లోకానికి ఏర్పడిన ఎన్నో బాధలను ఇతడు మాన్పినాడు. లోకాలు ఈయన మూడు అడుగులు. కరి మొర విని కాచిన ఘనుడు ఇతడే. మరి ఇతనికంటె అధికులైన దేవత లెవరు? వైకుంఠానికి ప్రభువు, శ్రీలక్ష్మీదేవికి నాథుడు, వేదప్రతిపాదితదైవం, స్థావరజంగమాలలో అంతర్యామి. ఆశ్రితుల కందరికీ ఆధారభూతుడు ఈ వేంకటేశ్వరుడే. *('కమలనాభుడు' అనడం వల్ల - ఇతడే బ్రహ్మకు తండ్రి అనీ విశేషార్థం.)*



మహాశయా!!

డిసెంబరు సంచికలో అన్నమాచార్యుల సంకీర్తన పాఠం తప్పు పరిశీలించగలరు. అర్థం సంశయాత్మకం. ఇద్దరు చెలులనీ వారు తెరపట్టుకొన్నారని పాటలోలేదు. తెర వున్నది. చెలికత్తెలు (సంఖ్యతెలియదు) సగం వికసించిన మొగ్గలతో ఆమె (నాట్యాన్ని)ను అభినందిస్తున్నారు.

వంటింటి ముందు (తిరుమలాలయంలో) ఉన్న దీనిని వకుళమాత అంటున్నారు. ఆమె నిశ్చయంగా అలమేలుమంగయే. ఒక సంకీర్తనలో అన్నమయ్య 'వంటింటనున్న(లక్ష్మి) నీ విభునకు వండి వడ్డించు' అన్నాడు. తిరుచానూరులో నున్న పద్మావతి వలెనే యీమె కుడిచేత అభయముద్ర ఎడమచేత వరదముద్ర ఉండేవి.

చిన్నన్న రచించిన 'అన్నమాచార్య చరిత్ర'లోనూ ఈ విషయం ఉన్నది. (అదే సంచిక పుట 18, గల్లా చలపతి వ్యాసం) యాగశాల ముందున్న అలమేలుమంగను దర్శించాడు అన్నమయ్య అని ఇలా అలమేలుమంగ అంటూ అన్నమయ్య ఏనాడో తేల్చాడు. దీని గురించి చారిత్రక పరిశోధన చేయ వలసింది.

- వి.ఎ.కె.రంగారావు, చెన్నై.

ఇదే సంచికలో...

శ్రీపద్మావతిఅమ్మవారి ముఖచిత్రంతో వెలువడిన డిసెంబరు సప్తగిరిసంచిక సరికొత్తగా ఉంది. వైకుంఠఏకాదశి విశిష్టత తెలుసు కున్నాం. 'చరిత్రలో తిరుచానూరు', 'శ్రీరామసంకీర్తనలు - అన్న మయ్య' వ్యాసాల ద్వారా ఎన్నో సంగతులు తెలుసుకున్నాం.

'రాశిఫలాలు' పుట సరికొత్తగా ఉన్నది. 'తప్పక సందర్శిం చండి' శీర్షిక ఆసక్తికరంగా ఉంది. 'వైకుంఠపాళి' జవాబులు కూడా ఇదే సంచికలో వేరే పేజీలో ఇస్తే మేము పిల్లలకు కూడా జవా బులు చెప్పే అవకాశం ఉంటుంది. పెద్దవారికే ఎక్కువ సమాధా నాలు తెలీవు. నెలవరకు ఆగే కంటే వెంటనే సమాధానాలు దొరికితే వైకుంఠపాళి శీర్షిక ప్రయోజనకారి.

- గుగ్గిలం శ్రీహరి, వేటపాలెం, ప్రకాశంజిల్లా.

వేయికళ్లతో....

'ఉత్తరద్వారము తెరిచేరోజు', 'తప్పక సందర్శించండి' బాగా ఉన్నాయి. సప్తగిరి పత్రిక ఎప్పుడు మా ఇంటికి వస్తుందా? అని వేయికళ్లతో శ్రీవారిప్రసాదంగా భావించి మా ఇంటిల్లిపాదీ ఎదురుచూస్తూ ఉంటాం.

- కె.పురుషోత్తము రెడ్డి,
పుట్టపల్లి, మహబూబ్‌నగర్.

సరికొత్త అందాలతో...

సప్తగిరి మాసపత్రిక గతంకంటే బాగా అందంగా ముద్రిస్తున్నందుకు చాలా సంతోషం. డిసెంబరు, 2015 సంచిక కొత్త వ్యాసాలతో అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉన్నది.

- జె.సతీష్‌కుమార్‌శర్మ, బైరమంగలం.

2016 మార్చి నెల ఉత్సవాలు, పండుగలు

ఫిబ్రవరి 26 నుండి మార్చి 6 వరకు
శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి (శ్రీనివాసమంగాపురం) బ్రహ్మోత్సవాలు.

ఫిబ్రవరి 28 నుండి మార్చి 9 వరకు
శ్రీకపిలేశ్వర స్వామి (తిరుపతి) బ్రహ్మోత్సవాలు.

మార్చి 07 నుండి 16 వరకు
శ్రీకోదండరామస్వామి (తిరుపతి) బ్రహ్మోత్సవాలు.

మార్చి 14 నుండి 23 వరకు
శ్రీలక్ష్మీనరసింహస్వామి(తరిగొండ) బ్రహ్మోత్సవాలు.

మార్చి 19 నుండి 23 వరకు
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తెప్పోత్సవాలు.

మార్చి 23 నుండి 27 వరకు
నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారికి సూర్యసేవకు తెప్పోత్సవాలు.

07 మహాశివరాత్రి

23 శ్రీలక్ష్మీజయంతి, హోలీపండుగ, తుంబురతీర్థముక్కోటి.



సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సంపుటి 46 | ఫిబ్రవరి 2016 | సంచిక 9

ఈ నెలలో....

ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి, శ్రీనివాసమంగాపురం

వెనుకచిత్రం : శ్రీకామాక్షీసమేత శ్రీకపిలేశ్వరస్వామి

వేంకటాద్రిసమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో
న భూతో న భవిష్యతి ॥

సప్తగిరి మాస పత్రిక

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



'రంగుల హరి సిరి' సప్తగిరి

సప్తగిరులు అనేక వర్ణాత్మక పుష్పాలకు, ధాతువులకు, వనమూలికలకు నిలయం. సప్తగిరీశుడైన శ్రీవేంకటేశ్వరుడు సప్తగిరులను కలియుగ వైకుంఠంగా భావించి లోకశ్రేయస్సును కోరి అర్చామూర్తియై నిత్యమూ భక్తకోటిని పరిపాలిస్తున్నాడు. భగవంతుడు సత్యాన్ని, ధర్మాన్ని రక్షించడమే ధ్యేయంగా కలవాడు. ఆ స్వామి యొక్క మహిమలను, భక్తుల అనుభవాలను, అనేక ధార్మిక, ఆధ్యాత్మిక విశేషాలను పాఠకలోకానికి అందించడం కోసం గత ఏడు దశాబ్దాలుగా వెలువడు తున్న మాసపత్రిక '**సప్తగిరి**'. ఇది సప్తగిరుల సార్వభౌముని మానసపుత్రిక. ఒకనాడు తిరుమల కైంకర్య విశేషాలు ప్రకటించే కరదీపికగా ప్రారంభమై ప్రస్తుతం ఆరుభాషల్లో – భగవంతుని షడ్గుణాలకు ప్రతీకలుగా ప్రచురితమౌతూ ప్రారంభించిన నాటి నుండి అశేషహైందవ పాఠకమహాశయుల ఆరాధ్యపత్రికగా శోభిస్తూంది.


క్రమేణా, సప్తగిరి మాసపత్రిక '**ఇంతింతై వటుడింతయై**' అన్నట్లు దినదినాభివృద్ధి చెంది 2016, జనవరి నుంచి ప్రతిపుట సప్తవర్ణాత్మకమై వెలువడుతోంది. '**సప్తగిరి**' అంటే సప్తగిరుల సమూహం. శ్రీవారు సప్తగిరీశుడు. సప్తవర్ణాలు ప్రకృతి సిద్ధమైనవి. విశ్వప్రకృతిని సప్తవర్ణాలతో రంజింపచేస్తూ శ్రీవారు– తాను ఆనందిస్తూ, భక్తకోటిని ఆనందింప జేస్తున్నాడు. '**సప్తగిరి**' పత్రిక స్వామి మానసపుత్రిక కనుక– సిరులొలికే రంగురంగుల అక్షరాలతో, చిత్రాలతో శ్రీవారి అలంకారవస్తుశోభలకు అక్షరాకృతిగా మీ ముందుంటూంది. మానవశరీరంలోని మూలాధారం నుండి సహస్రారం వరకు గల ఏడు యోగచక్రాలూ–ఏడు వర్ణాలతో ప్రకాశిస్తుంటాయి. ఇంద్రధనుస్సు ఏడువర్ణాలతో ప్రకృతిని పులకింప జేస్తుంది. సప్తగిరులు చిత్రవిచిత్రవర్ణాలతో శ్రీవారిని సేవిస్తూంది. ఇకపై సప్తగిరిపత్రిక కూడా చిత్రవర్ణాక్షర సేవతో శ్రీవారిని అలంకరిస్తూ – భక్తుల్ని అలరింపజేస్తూంది.

'**రంగులహరిసిరి**'గా వర్ణచిత్రాక్షర ముద్రణతో ఆహ్లాదాన్ని కలిగిస్తూ శ్రీస్వామివారి వైభవాన్ని చదివి, మనోదృష్టితో చూచి ఆనందించే మహాభాగ్యానికి భక్తులు నోచుకున్నారు. ఇందుకు ప్రస్తుత ధర్మకర్తలమండలి, శ్రీకార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారి ద్వయం, ప్రాజెక్టుల ప్రత్యేకాధికారి, పత్రికాలయసిబ్బంది, తి.తి.దే. ముద్రణాలయ సిబ్బంది అందరూ సంయుక్త సమన్వయంతో శతథా కృషి చేస్తున్నారు.

అలంకారప్రియో విష్ణుః – స్వామికి అనేక వర్ణాలు గల ఆభరణాలు, వస్త్రాలు, పుష్పాలు మొదలైనవి ఎంతో ప్రీతి పాత్రాలు. అందుకు ప్రతీకగానే సప్తగిరి పత్రిక సప్తగిరీశుని ప్రీతిపాత్రమై ఆయనే తన పత్రికను తన భక్త లోకానికి నచ్చే విధంగా తీర్చిదిద్దుకునే సంకల్పాన్ని కలిగించి ఫలవంతం చేస్తున్నాడు.

పాఠక మహాశయులు ఆరు భాషల్లోనూ రంగుల్లో వస్తున్న '**సప్తగిరి**' పత్రికను ఆదరించి శ్రీవారి కృపాపాత్రులై ధన్యులౌతారని ఆకాంక్ష!

భక్తుల ఆనందమే ఆనందనిలయుని ఆనందం!



శ్రీరస్తు – శుభమస్తు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

మనస్సును శుభమయం చేసుకుంటే, అన్నీ శుభాలే జరుగుతాయని సనాతనధర్మవచనం.

"భద్రం మనః కృణుష్వ" అని సామవేదమంత్రం చెబుతున్నది.

'మన మనస్సును క్షేమకరంగా మలచ'మని దైవాన్ని ప్రార్థించాలి. విత్తనంలో ఉండే లక్షణమే వృక్షానికి సంక్రమిస్తుంది– అటు తర్వాత మట్టివంటి బాహ్యపదార్థాల సాంగత్యం. అలాగే మనస్సులో ఉండే సల్లక్షణమే బహిర్గతమవుతుంది. అటువంటి శుభలక్షణసంపన్నమైన మనస్సుకు సత్సాంగత్యం తోడైనప్పుడు చేతలన్నీ ఫలవంతాలవుతాయి.

అందుకే మంచి జరుగుతుందనే సద్భావనాదృక్పథంతోనే భవితవ్యాన్ని దర్శించాలి. జరిగేది మంచిదేననే మరో సద్దృష్టిని సాధించాలి. ఇలా సద్భావనామయమైన చిత్తంలోని సంకల్పాలన్నీ సత్సంకల్పాలే అవుతాయి. అటువంటి సంకల్పాలతో చేసే ఆకాంక్షలు 'శుభాకాంక్షలు' అనిపించుకుంటాయి.

అవి తప్పకుండా సత్ఫలితాలను సాధిస్తాయి.

"నేను లంకకు వెళతాను. సీతమ్మను దర్శిస్తాను. ...ఎలాగైనా కార్యాన్ని సాధిస్తాను... శుభం జరుగుతుంది" అని బయలుదేరిన ఆంజనేయునిమాటలోని ఆత్మవిశ్వాసం – సత్సంకల్పంచేత బలోపేతమయింది.

అటువంటి సత్పురుషునిశుభాకాంక్షలకు, ఇంకెందరిశుభకాంక్షలో తప్పకుండా జత కలుస్తాయి. అందుకే సీతాన్వేషణకు బయలుదేరిన హనుమదాదులకు శ్రీరాముడు పలికినశుభాకాంక్షలు మొదటివి.

ఆపై మార్గంలో స్వయంప్రభ, సంపాతి, మైనాకుడు, సురస... మొదలైన దివ్యులు శుభాకాంక్షలు పలికారు.

"మంచి జరుగుతుందనే సద్భావనా దృక్పథంతోనే భవితవ్యాన్ని దర్శించాలి. జరిగేది మంచిదేననే మరో సద్దృష్టిని సాధించాలి. ఇలా సద్భావనామయమైన చిత్తంలోని సంకల్పాలన్నీ సత్సంకల్పాలే అవుతాయి. అటువంటి సంకల్పాలతో చేసే ఆకాంక్షలు 'శుభాకాంక్షలు' అనిపించుకుంటాయి."

ఆకాంక్షకు బలీయమైన ప్రభావం ఉంటుంది.

ఈ శుభాకాంక్షల సంస్కృతి అనాదివేదనాదంలో, సనాతన సంప్రదాయంలో బలంగా వేళ్ళూనుకుంది. ఒక పవిత్రదినాన, సత్కార్య ఆరంభవేళల్లో జన్మదినసందర్భాల్లో మనవాళ్ళు పెద్దలకు నమస్కరిస్తారు.

అప్పుడు వారినుంచి **'దీర్ఘాయుష్మాన్ భవ', 'శ్రీ రస్తు - శుభ మస్తు - అవిఘ్న మస్తు', 'దీర్ఘసుమంగళీ భవ', ఆయురారోగ్యాభివృద్ధి రస్తు', 'స్వస్తి'** మొదలైన దీవెనలు లభిస్తాయి.

ఇవి కేవలం పెద్దవాళ్లు చిన్నవాళ్లకు క్షేమం కోరుతూ పలుకుతున్నవి- అనిమాత్రమే భావం కాదు. అవి పెద్దమనస్సుతో వారనేమాటలు. 'ఆశించేవి ఆశీస్సులు'. మంగళకరంగా భావించడం, భాషించడం...... రెండూ అవసరమే! ఆకాంక్ష మనస్సులోనుంచీ బలంగా మాటలోకి ఒదిగినప్పుడు మంత్రమై అమోఘంగా సఫలమవుతుంది.

శతం జీవేమ శరద స్సవీరాః ॥

'మేము పుత్రపౌత్రాదులతో పరిపూర్ణులమై వందేళ్లు తృప్తిగా జీవింతుము గాక!' అని దైవాన్ని ప్రార్థించే విధానాన్ని అథర్వ వేదం నేర్పింది.

'మా నో ద్విక్షత కశ్చన॥'- 'మేము ఎవరితోను శత్రుత్వాన్ని (ద్వేషాన్ని) పూని ఉండకూడదు-మమ్మల్ని ఎవరూ ద్వేషింప కూడదు.' ఇది మరొక అద్భుతమైన వైదికశుభాకాంక్ష. హింస, క్రోధం, వాక్పారుష్యం వంటి అశాంతి అవతారాలకు మూలబీజం ద్వేషమే! ద్వేషాన్ని పారద్రోలి, ఈ శుభాన్ని ప్రతిఒక్కరూ ఆకాంక్షిస్తే ఇంక కావల్సింది ఏముంది?

"శం మే అస్తు - అభయం మే అస్తు" (నాకు శాంతి, సుఖం, ఉండుగాక! అభయం ఉండుగాక!) అని అథర్వవేద మంత్రం. ద్వేషరహితమైన స్థితిలోనే శాంతి, అభయం సాధ్యమవుతాయి. సనాతనధర్మం సమాజంకోసం చేసుకున్న శుభాకాంక్ష ఇది.

వేదసాహిత్యంలో 'చమకం' అనే ఒక మంత్రభాగం ఉంది.

అందులో మానవజీవితానికీ, తనచుట్టూ ఉన్న ప్రకృతికీ క్షేమకరమైన శారీరక, ప్రాకృతిక, మానసిక వనరులను వాంఛించడమే ప్రధానభావం.

అన్నికోరికలనూ "యజ్ఞేన కల్పతామ్" అనే మాటతో అనుసంధించారు. అంటే మనం అడిగే శారీరకశక్తులు, భౌతిక పదార్థాలు, బుద్ధిగరిమలు... అన్నీ యజ్ఞంద్వారా సమర్థమగు గాక! అని తాత్పర్యం.

యజ్ఞం = ఈశ్వరార్పణమైన సత్కర్మ. ఈ శక్తులు, వనరులు ఈశ్వరార్పణం కావాలి - దానివల్లనే ఇవి సమర్థవంతంగా మనల్ని శాంతిమార్గంలో జీవింపజేస్తాయి - అని భావం.

ఇలాంటి కల్యాణకరమైన భావనలను పండించుకున్న అంతరంగంనుంచి వెలికివచ్చే ఆకాంక్షలు, ఆచరణలు శుభపరంపరలను వెదజల్లుతాయనడంలో సందేహం లేదు.



సూర్యభగవానుడి పుట్టిన రోజు

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య,
98481 11794

2016, ఫిబ్రవరి 14వ తేది రథసప్తమి సందర్భంగా...

రథసప్తమి ముఖ్యంగా సూర్యుణ్ణి ఆరాధించే పండుగ. ఇది మాఘశుద్ధసప్తమినాడు వస్తుంది. సూర్యగ్రహణంతో సమానమైనపర్వంగా (గ్రహణం) శాస్త్రాలు పేర్కొన్నాయి. ఈనాడు అరుణోదయ కాలంలో స్నానంచేయడం, సూర్యుణ్ణి ధ్యానించడం మహాపుణ్యఫలప్రద మనీ, ఆరోగ్యకర మనీ, అకాలమృత్యపరిహారక మనీ, మరణానంతరం సూర్య లోకాన్ని పొందు తా రనీ మహర్షులు పేర్కొన్నారు.

రథసప్తమి ముఖ్యంగా సూర్యుణ్ణి ఆరాధించే పండుగ. ఇది మాఘశుద్ధసప్తమినాడు వస్తుంది. సూర్యగ్రహణంతో సమానమైన పర్వంగా (గ్రహణం) శాస్త్రాలు పేర్కొన్నాయి. ఈనాడు అరుణోదయకాలంలో స్నానం చేయడం, సూర్యుణ్ణి ధ్యానించడం, మహాపుణ్యఫలప్రద మనీ, ఆరోగ్యకర మనీ, అకాలమృత్యపరిహారక మనీ, మరణానంతరం సూర్యలోకాన్ని పొందుతా రనీ మహర్షులు పేర్కొన్నారు. షష్ఠినాడు రాత్రి ఉపవాసం చేసి, సప్తమినాడు అరుణోదయ కాలంలో (సూర్యోదయానికి కొంత ముందు) స్నానం చేస్తే- ఏడుజన్మలపాపాలూ తొలగుతా యనీ, రోగాలూ, దుఃఖాలూ నశిస్తా యనీ, జన్మజన్మాంతర, మనోవాక్కాయ, జ్ఞాతాజ్ఞాత లనెడి సప్తవిధపాపాలూ హరింపబడతా యనీ, ఈ సమయంలో

స్నానవిధానం

వ్రతచూడామణిలో "బంగారు, వెండి, రాగి, ఇనుము, వీటిలో దేనితో నయినా చేసినదీపప్రమిదను సిద్ధం చేసుకోవాలి. అందులో (నెయ్యి, నువ్వులనూనె, ఆముదం, ఇప్పనూనె - వీనిలో ఏదో ఒకదానితో) దీపం వెలిగించాలి. ఆ దీపాన్ని నెత్తిపై పెట్టుకొని, నదీతీరానికిగానీ, చెరువులవద్దకుగానీ వెళ్ళి, సూర్యుణ్ణి ధ్యానించి, ఆ దీపాన్ని నీళ్లలో వదలి, ఎవ్వరూ నీటిని తాకక ముందే స్నానం చేయాలి. స్నానం చేసేటప్పుడు ఏడుజిల్లేడాకులు గానీ, ఏడురేగుఆకులుగానీ తలపై పెట్టుకోవాలి.

జననీ త్వం హి లోకానాం సప్తమీ సప్తసప్తికే । సప్తవ్యాహృతికే దేవి! నమ స్తే సూర్యమాతృకే ॥

"సప్తాశ్వా లుండే ఓ సప్తమీ! నీవు సకలలోకాలకూ తల్లివి. సూర్యునికి తల్లివైన నీకు నమస్కారం"- అని చెప్తూ, సూర్యునికి అర్ఘ్య మివ్వాలి. సూర్యుణ్ణి పూజించాలి. పిదప తర్పణం చేయాలి.

వైవస్వతమన్వాది ఈనాడే కావడం విశేషం. వైవస్వతుడు ఏడవమనువు. సూర్యుడు వివస్వంతుడు. ఇతనికొడుకు కనుక వైవస్వతుడు (ఇప్పటిమనువు వైవస్వతుడే). ఇతని మన్వంతరానికి రథసప్తమియే సంవత్సరాది- అంటే ఉగాది. మన్వంతరాది పర్వదినం పితృదేవతలకు ప్రియమైంది. కనుకనే రథసప్తమినాడు- మకరసంక్రాంతివలెనే- పితృతర్పణం చేయాలి. పితృదేవతలకు సంతోషం కల్గించాలి. చాక్షుషమన్వంతరంలోని ద్రవిడదేశాధిపతి అయిన సత్యవంతుడే, ఈ కల్పంలో వైవస్వతుడుగా పుట్టినాడు. సంవత్సరానికి వచ్చే 24 సప్తముల్లోనూ రథసప్తమి ఖగోళరీత్యాకూడా ఎంతో గొప్పది.

ఈ రోజు సూర్యోదయకాలంలో ఆకాశంలో నక్షత్రాల సన్నివేశం రథాకారంలో ఉంటుంది. రథాకారంలో నక్షత్రా లున్న సప్తమీదినం కనుక రథసప్తమి. సాధారణంగా చంద్రోదయ సూర్యోదయవేళల్లో ఆకాశంలో ఉండే నక్షత్రాలసన్నివేశాన్నిబట్టి వ్రతాలూ, పూజలూ, పండుగలూ నిర్ణయించబడినాయి.

తిరుమలలో - రథసప్తమి

శ్రీతిరుమలేశునికీ, రథసప్తమికీ అవినాభావసంబంధ ముంది. శ్రీస్వామివారికీ, సూర్యునికీ సప్తసంఖ్య ఇష్టమైంది. శ్రీవారు ఏడుకొండలపై ఉండి, భక్తుల్ని కాపాడుతున్నారు. సూర్యుడు ఏడుగుఱ్ఱాలపై పయనిస్తూ, పైనున్న ఏడులోకాలనూ, క్రిందనున్న ఏడు లోకాలనూ తనకాంతికిరణాలతో చైతన్యవంతం చేస్తున్నాడు. ఇరువురూ అంధకారనివారకులూ. పాపపరిహారకులూ. శ్రీభూదేవీసమేతుడు స్వామి. ఛాయాసంజ్ఞాసమేతుడు రవి. సర్వలోకసంరక్షణం, సంచారం ఇర్వురిలోనూ సమానం. స్వామి వేంకటనారాయణుడు. రవి సూర్యనారాయణుడు. శ్రీవారిరథమూ హిరణ్మయమే! సూర్యునిరథమూ హిరణ్మయమే! ఇలా అన్నింటను సామ్యమున్నందున శ్రీవారివిశేషోత్సవాలలో రథసప్తమి ఒక విశిష్టస్థానాన్ని అలంకరించుకొనింది.



ప్రతిసంవత్సరం మాఘశుద్ధసప్తమి "సూర్యజయంతి" నాడు తిరుమలలో "రథసప్తమి" పేరుతో ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు శ్రీవారు సూర్యోదయంనుండి, సూర్యాస్తమయంవరకు ఏడువాహనాల్లో విహరిస్తారు. 1)సూర్యప్రభవాహనం 2)చిన్న శేషవాహనం 3)గరుడవాహనం 4)హనుమద్వాహనం 5)కల్పవృక్షవాహనం 6)సర్వభూపాలవాహనం 7)చంద్రప్రభవాహనం.

మధ్యాహ్నం 'చక్రత్తాళ్వార్' (సుదర్శనచక్రం) వారికి వరాహస్వామిసన్నిధిలో చక్రస్నానం జరుగుతుంది. ఎన్నడూలేని విధంగా ఒకేరోజు ఏడువాహనాల్లో, ఏడుమార్లు వివిధాలంకారాల్తో, దివ్యశోభల్తో శ్రీవారు ఉత్సవమూర్తిగా భక్తులకు దర్శన మివ్వడం రథసప్తమినాడుమాత్రమే జరిగే విశేషవిశిష్టమహోత్సవం. కనుకనే రథసప్తమీఉత్సవాన్ని అర్ధబ్రహ్మోత్సవమనీ, ఏకదిన (ఒకరోజు) బ్రహ్మోత్సవమనీ భక్తులు భక్తిప్రపత్తుల్తో కీర్తిస్తారు.

చేసే స్నానం, అర్పించే అర్ఘ్యం, ఇచ్చే దానాలూ మహాపుణ్యాన్ని కల్గించి, దీర్ఘ ఆయురారోగ్యసంపదలు చేకూరుస్తా యనీ ధర్మసింధువు మున్నగుశాస్త్రాలు పేర్కొన్నాయి.

జిల్లేడు, రేగుఆకుల ప్రాశస్త్యం

రథసప్తమినాటి శిరస్స్నానంలో జిల్లేడు, రేగు ఆకులను (రేగుపండ్లు కూడ) తలపై, భుజాలపై, చేతులపై పెట్టుకొని స్నానం చేయాలి. మన భారతీయ ఆచారాలు మూఢవిశ్వాసాలు కావు. వీటివెనుక ఎన్నో ఆరోగ్యకరమైన విజ్ఞానాంశాలు నిల్చి ఉన్నాయి.


సూర్యకిరణాల్లోని 'ప్రాణశక్తిని' అత్యధికంగా నిల్వచేసుకొనేవృక్షజాతుల్లో రుద్రాక్ష, జిల్లేడు, రేగు, ముఖ్యమైనవి.

వృక్షజాతిలో జిల్లేడు, రేగు ఆకులు సూర్యకిరణాల్లోని ప్రాణశక్తిని అధికంగా గ్రహించి, నిల్వ ఉంచుకొంటాయి కనుక, **ఈ ఆకుల్ని స్పృశిస్తూ స్నానం చేయడం వల్ల వీటిలోని విద్యుచ్ఛక్తీ, నీళ్లలోని విద్యుచ్ఛక్తీ కలిసి, శరీరంపై, ఆరోగ్యం పై ఎంతో ప్రభావాన్ని చూపి, సత్ఫలాలు ఇస్తాయి.** కేవలం రథసప్తమినాడే కాక, రోజూకూడా ఈ ఆకుల్ని పెట్టుకొని, స్నానం చేస్తే మంచిది. కానీ, కనీసం సంవత్సరానికి ఒక్కమారు తాకినా - వాటి స్పర్శాప్రభావం ఆ సంవత్సరమంతా మనపై ఉంటుం దని భావించి, ఈ పండుగనాడు వీటితో శిరస్స్నానం తప్పక చేయా లని పెద్దలు సూచించారు.

ఈ ఆకుల్లో నిల్వచేయబడిన ప్రాణశక్తి, శిరోభాగంలోని సహస్రారాన్ని ఉద్దీపనం చేసి, అందలినాడుల్ని ఉత్తేజపరుస్తుంది. దానివల్ల మానసికదృఢత్వం, జ్ఞాపకశక్తీ పెరుగుతాయి. శిరస్సంబంధమైన రోగాలు నశిస్తాయి.

ఈ రోజు చిక్కుడుకాయల్తో రథాన్ని చేసి, అందు సూర్య బింబప్రతిమను తమలపాకుపై కుంకుమతో గీచి ఉంచి, పూజించడమూ కొన్నిచోట్ల ఆచారం.

జిల్లేడూ, రేగూవలె చిక్కుడుకూడా గొప్పప్రభావం కలదియే! చిక్కుడుకాయలు స్తన్యవృద్ధి గావిస్తాయి. పురుషత్వాన్ని పెంచుతాయి. ఊపిరితిత్తుల్ని శుభ్రపరుస్తాయి. (చిక్కుడు గింజలు, ఆరోగ్యకరాలు కావు.)



సూర్యోపాసన

"సూర్య ఆత్మా జగత స్తస్థుష శ్చ" – మనసౌర కుటుంబంలోని అన్నిప్రాణులకూ సూర్యుడే ఆత్మ. కృష్ణయజుర్వేదంలోని – ఆరణ్యకభాగంలో 'అరుణప్రశ్న' (అరుణ కేతుకం) ఉంది. (ప్రశ్న=కొన్నిప్రకరణాలసముదాయం) దీన్ని పారాయణం చేస్తే – ఋణ, రోగ, శత్రుబాధలు నశిస్తాయి. ఇది సూర్యపారమ్యాన్ని వివరించేప్రశ్నం. మనం మంత్రపుష్పాల్లో ఒక్కటిగా పేర్కొనే "యోఽపాం పుష్పం వేద, పుష్పవాన్ ప్రజావాన్, పశుమాన్ భవతి" అనే వాక్యా లుండేమంత్రం 'అరుణం' లోనిదే! "జలంయొక్క పుష్పస్వరూపం తెలుసుకొన్నవాడు పుష్పవంతుడు, సంతానవంతుడు, పశుసంపత్సమృద్ధిమంతుడూ అవుతా"దని అర్థం. అంటే– మనశరీరంలో జీవాత్మ అనే పేరుతో రూఢిగా ఉండే ఆత్మచైతన్యం– ఈ జీవాత్మచైతన్య మనేపుష్పం, సౌరచైతన్య మనేపుష్పం రెండూ ఒకటే! ఇవి వేరుకావు – అని తెలుసుకొన్నవానికి మోక్షపుష్పం ఆఘ్రాణితం (వాసనచూడబడుతుంది=ఆ పుష్పాన్ని వాసన చూచినవాడు అవుతాడు) అవుతుందని తాత్పర్యం. ఈ జీవాత్మచైతన్యం జలబహుళమైన మానవ రూపాల్లో ఉంటుంది. ఇదే నారాయణతత్త్వం! (నారా= జలము, నరులు; అయనం=స్థానం, జలాన్నీ, నరుల్నీ స్థానంగా గలవాడు నారాయణుడు) మనశరీరంలో కూడా 90% నీరేకదా ఉన్నది! కనుక సూర్యుడు సకలాత్మ!

ఆరోగ్యదాత - సూర్యుడు

జ్యోతిశ్శాస్త్రం – "ఆత్మప్రభావశక్తి శ్చ పితృచింతా రవేః ఫల"మ్మని సూర్యగ్రహఫలితాన్ని చెప్పింది. సూర్యోపాసనవల్ల, సూర్యగ్రహప్రభావంవల్ల ఆత్మశక్తి పెరుగుతుంది. తండ్రి విషయంకూడా సూర్యుణ్ణిబట్టే తెలుస్తుంది. నేత్రశక్తిపెరుగుదలకూ, హృద్రోగనివారణకూ సూర్యుడే ఆరాధ్యుడు. సూర్యుడు ఆరోగ్యప్రదాత, "ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్" కదా! ఆరోగ్యం సూర్యునిద్వారా పొందాలి. సూర్యకాంతిలోని నీలికిరణాల ప్రభావంవల్లనే మనశరీరం సహజసిద్ధంగా విటమిన్ 'డి'ని ఉత్పత్తి చేసుకొంటోంది. 'డి'విటమిన్ లోపిస్తే ఎముకలపెరుగు

దల తగ్గిపోతుంది. సూర్యకిరణజన్యసంయోగంవల్లనే సృష్టి, ఆహారం, పోషణం మున్నగునవి ఏర్పడుతున్నాయి. సూర్యకిరణాలు మానవశరీరంపై తప్పక ప్రసరించాలి. అందుకే వైదిక వాఙ్మయం సంధ్యావందనం, సూర్యనమస్కారాలు, అర్ఘ్యప్రదానం- మున్నగు ప్రక్రియల్ని ప్రవేశపెట్టింది.

సప్తాశ్వుడు - సూర్యుడు

సూర్యకిరణకాంతి ఏడురంగులతో ఉంటుంది. ఆ కాంతివర్ణాలనే ఏడుగుఱ్ఱాలుగా పేర్కొని, సూర్యుణ్ణి 'సప్తాశ్వుడు', 'సప్తసప్తి' అన్నారు. వాస్తవానికి 'వేగ'మనేది ఒక్కటే అతనిగుఱ్ఱం. (ఇతరగ్రహాలకు మందశీఘ్రగమనా లుంటాయి). సూర్యునికి గమనం ఒక్కటే! దానిపేరే "సప్త". కాగా "సప్త" అనే పేరుగల గుఱ్ఱం (అశ్వం) అనగా కాంతిగమనవేగం ఒక్కటే-ఏడుగా వర్ణితమైంది. "అరుణం" - ఈ విషయాన్ని వివరించింది. స్థూల దృష్టికి కాంతికిరణం ఏడురంగుల్తో గోచరించినా, అతినీలలోహితాదికిరణాలు కోట్లకొలదీ ఉన్నా యని పేర్కొంటున్నారు- శాస్త్రజ్ఞులు. అశ్వా లంటే కిరణాలే!

అశ్వ-మంటే గమనంతో వ్యాపించేది అని వ్యుత్పత్తి. కిరణాలు గమనంతో వ్యాపిస్తాయి కనుక అశ్వా లయ్యాయి. హయః - అంటే శీఘ్రంగా పోయేది. సప్తిః- అంటే సేవాదిధర్మాలతో కూడింది. ఇలా అశ్వాదిశబ్దవ్యుత్పత్తులు - గుఱ్ఱాన్ని పేర్కొనేవి అన్నీ- గమనాన్నే సూచిస్తుండటం విశేషం! "తస్మా దశ్వా అజాయత" అని వేదంకూడా సృష్టియజ్ఞంలో మొదట ఏర్పడింది 'అశ్వమే' అనింది.

ఓంకారస్ఫోటనంలో మొదట కాంతి ఏర్పడింది. ఆ కాంతియే సూర్యుడు. ఆ అశ్వాలే అతనికిరణాలు. సూర్య దంటే 'కిరణాలనూ, ప్రాణశక్తుల్నీ, నీటియందలి రసాన్నీ స్వీకరించేవాడు. ఆకాశంలో సంచరించేవాడు. లోకాన్ని సృష్టించేవాడు, ప్రాణుల్ని కర్మలకు ప్రేరేపించేవాడు" అని అర్థాలు.

సూర్యా ద్భవంతి భూతాని, సూర్యేణ పాలితాని చ ।
సూర్యే లయం ప్రాప్నువంతి య స్సూర్యః సోఽహమేవ చ ॥

'సృష్టిస్థితిలయాలు సూర్యునివల్లనే జరుగుతున్నా యనీ, ఆ సూర్యుడే నేనై ఉన్నా' నని సూర్యోపనిషత్తు సూచించింది.

సప్తాశ్వః-సప్త అశ్వాః యస్య సః-ఏడుగుఱ్ఱాలు కలవాడు, సప్తనామకః అశ్వః యస్య సః='సప్త' అనే ఒక్క గుఱ్ఱం కలవాడు అనీ వ్యుత్పత్తు లున్నాయి. కాగా అర్థా లెన్ని ఉన్నా - సూర్యకిరణతత్త్వంమాత్రం ఒక్కటే! ఏకచక్ర మున్నట్లే - ఏకాశ్వం సూర్యరథానికి వాహనం.

ఏకచక్రరథం- రథః- అంటే దీనియందు క్రీడిస్తారు- అంటే సంతోషిస్తా రని అర్థం. ఆనందకారణమైంది, విజయసాధనమైందికూడా! చక్ర మంటే రథగమనాన్ని చేసేది- అని వ్యుత్పత్తి. ఆనందస్థానం రథం కాగా, ఆనందగమనాన్ని కల్గించే హృదయం చక్రం అవుతుంది. ఆనందాన్ని సర్వత్ర వ్యాపింపజేసే మనస్సు ఒక్కటే- అదే కాంతికిరణరూపమైన సప్తనామకఅశ్వం. అదే సప్తధా విభజింపబడి - సప్తాశ్వా లయింది.

రథసప్తమి ఎన్నో తాత్త్వికవిశేషాలకు నిలయం.

మనకు కన్పించే సూర్య డొక్కడే అయినా - బ్రహ్మాండంలో ఇంకా 11 మంది సూర్యులు (సూర్యగోళాలు) ఉన్నట్లు ఇటీవల శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. మనప్రాచీనమహర్షులు ద్వాదశాదిత్యులు (ద్వాదశాత్మా) ఉన్నా రని ఎన్నడో గుర్తించియే

ఉన్నారు. వారు – మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్య గర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరులు. (ఈ పేర్ల విషయంలో కొన్ని తేడా లున్నాయి). సర్వమూ వాసుదేవమయమే కనుక వాసుదేవ ద్వాదశాక్షరీమంత్రతేజమే ఈ ద్వాదశా దిత్యరూపంలో ప్రకాశిస్తూం దని భావించవచ్చు. ఈ ద్వాదశాదిత్యులే సంవత్సరాత్మకమైన కాలవిభాగంలోని ద్వాదశమాసాలకూ అధిదేవతలుగా పేర్కొనబడినారు. రాశులుకూడా ఇందువల్లనే 12 గా ఏర్పడినాయి. సూర్యుడు ఒక్కొక్కమాసంలో ఒక్కొక్క రాశిలో సంచరిస్తాడు.

సుప్రసిద్ధమైన గాయత్రీమంత్రం సూర్యపరమైందే! వేదాల్లోని సౌర సూక్తాలూ, రామాయణంలోని ఆదిత్యహృదయం, సూర్యారాధన యొక్క ప్రాచీనతనూ, ప్రభావాన్నీ సూచిస్తున్నాయి. సూర్యోపాసనతో అనేకలాభాలు పొందినవా రున్నారు. అగస్త్యుడు బోధించిన "ఆదిత్య హృదయ" ప్రభావంతోనే శ్రీరాముడు రావణుణ్ణి సంహరింపగల్గినవిషయం పరమసత్యం కదా! మయూరుడు సూర్యానుగ్రహంతో, కుష్ఠరోగం నుండి విముక్తుడైనాడు. అతని "మయూర శతకం" సుప్రసిద్ధం. సూర్యానుగ్రహంవల్లనే ద్రౌపది "అక్షయపాత్ర" పొందటంతో, అరణ్యవాసకాలంలో ఆహారసమస్య లేకుండా, అతిథిసత్కారాలతో పాండవులు ధన్యులైనారు. ఇలా ఎన్నో దృష్టాంతాలున్నాయి.











అన్నీ.... ఒకేరోజు!

సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమద్వాహనాల పై శ్రీ మలయప్ప స్వామివా రొక్కరే ఉత్సవానికి వస్తారు. మొదట సూర్యప్రభవాహనంపై సూర్యోదయవేళ- శ్రీవారు వాయవ్య మూలకు విచ్చేసి, ఉదయభానుకిరణాలు తనపై ప్రసరిస్తుండగా, అఖండ గోవింద నామకీర్తనలతో వేంకటాచలం ప్రతిధ్వనిస్తుండగా హారతి గైకొని, భక్తుల్ని కరుణిస్తారు. పిదప శేష, గరుడ, హనుమద్వాహనాలపై మలయప్ప స్వామివా రొక్కరే ఉత్సవానికి వస్తారు. మధ్యాహ్నం చక్రత్తాళ్వార్ ఒక్కరే శ్రీవరాహస్వామివారిసన్నిధిలో చక్రస్నానం చేస్తారు. తరువాత ఉభయనాంచారులతో శ్రీమలయప్పస్వామి వారు కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఉత్సవానికి వస్తారు. ఏడవదైన చంద్రప్రభవాహనంపై సాయంకాలం స్వామివా రొక్కరే, (ఉదయంవలె) ఉత్సవకైంకర్యం గైకొంటారు.

హృదయోల్లాసంతో ఉదయం శ్రీస్వామివారు ఒంటరిగానే వచ్చి, తన ఏకచక్రరథత్వాన్నీ, ఏకచ్ఛత్రాధిపత్యాన్నీ ప్రకటిస్తూ, చతుర్విధభక్తులకు, చతుర్విధ పురుషార్థాలనూ, చతుర్విధ మోక్షాలనూ ప్రసాదిస్తారు - కనుకనే దేవేరులను పిల్చుకరారు కాబోలు! సూర్యుడు- తనదక్షిణనేత్రం, శేషుడు తనశయ్య, గరుడుడు- తన సంచారవాహనం. హనుమంతుడు- రామావతారంలో తనను వహించినవాడు. చంద్రుడు- తనవామనేత్రం. ఈయైదువాహనసేవలనూ ఒక్కమారైనా స్వామి తానే ప్రత్యేకంగా ఉపయోగించుకోవడం న్యాయమేకదా!

కల్పవృక్ష, సర్వభూపాలవాహనాలు ఉభయనాంచారులకూ, తనకూ సమానమే కనుక దేవీద్వయంతో విచ్చేసి, సర్వభక్తులకూ కల్పవృక్షమై, కైంకర్యపరుల సర్వమనోరథాలను సఫలంచేసి, అనుగ్రహించి, దేవేరుల్ని మందిరానికి పంపి, సాయంకాలం ఏకాంతంగా ఆనందనిలయాన్ని ప్రవేశించి, దేవేరులతో ఆనందంగా ఇష్టాగోష్ఠి నిర్వహిస్తారు శ్రీవారు- మలయప్పమూర్తియై. •







98487 20478

నమ్మాళ్వార్లు తమ జ్ఞానప్రవాహకాంతి దీపాన్ని ప్రకృతి అంతటా అన్నిస్థలాల్లో, దేవాలయాల్లో చూచారు. అన్నిటికంటే ముఖ్యంగా తమఆత్మలో చూచారు. అంతేకాదు– ఇతరుల ఆత్మలలోనూ చూచారు. ప్రపంచానికంతటికీ ఒకే జీవం అని తెలుసుకున్నారు. అదేది? అతడే భగవంతుడు. ఆ భగవంతుడు పసితనంలోను, ముసలితనంలోను – కొత్తదనం లోనూ, పాతదనంలోనూ – గ్రామాల్లోనూ, నగరాల్లోనూ, దేశాల్లోనూ – సర్వత్ర ఉంటున్నాడు. ప్రాణమే కాదు – శరీరం కూడా అతడే అంటున్నారు – అంతా ఆ భగవంతునిమయంగా ఉండడంచేత– ఆతనికీ, భక్తులకూ, ప్రపంచానికీ సేవచేయడమే తమకు ఆనందం అంటున్నారు. ఒకే వస్తువు ఇన్ని జీవాణువులుగా వ్యాపించి ఉండే ప్రపంచప్రాణమైన ఆ భగవంతుని అంశలు గదా మనమంతా! కాబట్టి ఆ విశ్వ రూపంలో నేనూ ఒక భాగం అనే నమ్మికతో లోకోపకారకమైన సేవచేయడమే కదా భాగవతుల ధర్మం! శరీరబలాన్ని నమ్మి, అధర్మం చేయ కూడదు. బాల్యంనుండే సన్మార్గం, సత్ప్రవర్తనతో నడవాలి, అని పదే పదే పలవి పలవి, ఏడ్చి ఏడ్చి పాడుతున్నారు. ప్రేమలేని జ్ఞానం జ్ఞానం కాదు – ప్రేమమార్గమే దయా స్వరూపుడైన ఆ భగవంతునిదరికి చేరుస్తుంది. పరిపూర్ణ ప్రేమ పరమపరిత్యాగంనుంచే అవతరిస్తుంది. భగవంతుని ప్రేమలోను, సేవలోను ఒకడు తనను తాను పూర్తిగా త్యాగం చేయాల్సివస్తుంది – అప్పుడే ఆ భగవంతుడు మార్గాన్ని చూపి, మార్గదర్శిగా ఉండి, మనల్ని తనలో కలుపుకుంటాడు– అనేదే నమ్మాళ్వార్ల ముఖ్యమైనతాత్త్వికదృష్టి. అయితే నమ్మాళ్వార్లు "సన్యాసిగా ఉండినప్పటికీ – జనుల సుఖదుఃఖాలతో సమభావం పొంది, పాశురాల్ని పాడి, భక్తి ప్రబోధం చేయడంతో – భక్తులు ఈ లోకంలోని సుఖంతో పాటు పరలోకంలోని సుఖాన్ని కూడా పొందుతున్నా"రని చెబుతాడు.

ఇదిగో కవీశ్వరుల్నిగూర్చి ఏదో సెలవిస్తున్నారు – వినండి–

"ఓ కవీశ్వరుల్లారా! రండి – మీ శరీరాలు వంచి కష్టించి పనిచేసి జీవించండి. ఈ లోకంలో ఈనాడు మహా రాజులు లేరు – మిమ్ము ఆదరించడానికి. ఇందుకై విచారించాను. చూచాను. మీ మధురమైన కవిత్వాలతో మీ ఇష్టదేవతల్ని స్తుతించండి. ఆ విధంగా చేసిన స్తోత్రం తేజోమయకిరీటంతో ప్రకాశించే నా స్వామికి చేర్తుంది" – అని పండిత కవులను ప్రబోధిస్తున్నారు. భగవంతునిపై ప్రేమ కలిగి ఉండండి అని చెబుతున్నారు.

భగవంతునిపై నిజమైన భక్తి, ప్రేమ క్రమంగా వృద్ధి అయ్యే కొద్దీ–సమానమైన అనురాగం, సన్మార్గం, జాతీయసమత్వం అధికమౌతాయట! ఇవి ఎక్కువ కాగా కాగా ఈ ప్రపంచానికే ఒక నూతనయుగం ఆరంభమౌతుందని నమ్మాళ్వార్లసిద్ధాంతం. సిద్ధాంతమే కాదు – అటువంటి నూతనయుగాన్ని తన మనో నేత్రంతో చూచి –

"ఓ చేతనాత్ములారా! వినండి. వినండి. వినండి.-ఈ ఆశ్చర్యాన్ని! గంభీరస్వభావం గల శ్రీమన్నారాయణునిదాసులు ఈ ప్రపంచమంతా వ్యాపించి, నామసంకీర్తనం చేస్తూ, ఆడుతూ పాడుతూ - యథేష్టంగా తిరుగుతున్నారు. నేను చూచాను. జీవుల క్రూరమైనపాపం నశించింది. బాధలు పెట్టే నరకం కూడా శిథిలమైపోయింది. ఈ లోకంలో యమునికి ఏ పనీ లేదు. కలియుగం నశిస్తూ ఉంది. చూడండి. చూడండి, సమృద్ధి కలుగుగాక! సమృద్ధి కలుగుగాక! సమృద్ధి కలుగుగాక!

ఈ పాపిష్ఠి కలియుగం పోయి, గొప్పదైన కృతయుగం వచ్చింది. భక్తులైన నిత్యసూరులు అవతరిస్తున్నారు. గొప్ప ఆనందం కృతయుగంలో కలుగుతూంది. నీలమేఘంలాంటి శరీరకాంతి గలవాడు, సముద్రంవలే గంభీరస్వభావం కలవాడు అయిన నా స్వామిభక్తులు ఈ ప్రపంచమంతటా వ్యాపించి, భక్తిప్రబోధకాలైన కీర్తనలు గానం చేసి, సమస్తజీవులను తమ వశం కావించుకొన్నారు కదా" అని ఆనందతాండవం చేస్తున్నారు.

కలియుగం పూర్తికాక పూర్వమే భూమ్యాకాశాలు రెండూ కలిసి, ఈ పాపిష్ఠి కలియుగాన్ని పారదోలుతున్నాయి. ఈ కలియుగానికి ఇంకా కొన్ని చిన్ని చిన్ని ఆశలున్నాయట! అవీ పోతున్నాయి, కలియుగం ఎంతోదుఃఖాన్ని అనుభవిస్తూంది. ఆ దుఃఖం కృతయుగం రావడంతోనే పోతూ ఉంది. ఆ కృతయుగం ఎట్లా వచ్చిందంటున్నారో చూడండి- "ఏదో ఈ ప్రపంచవాసులకు మంచి చేయాలనే గొప్పఆశతో వస్తూంది. ప్రేమ పొంగి, ప్రవహంగా వస్తూంది. ఈ కృతయుగంలో రాక్షసస్వభావం కలవాళ్లకు స్థానం లేదు. కుత్సితమతులకు స్థానం లేదు - ఈ నూతనయుగంలో. ఇందుకు సందేహం లేదు." అంటున్నారు- నమ్మాళ్వార్లు. ఇంకా "ప్రాణుల్ని చంపి, భక్షిస్తున్న వ్యాధి - ద్వేషం-ఆకలి- అనే దోషాల్ని ఈ లోకంనుండి తరిమి వేయడానికి చక్రధరుడైన ఆ సర్వేశ్వరునిభక్తులు అవతరించారు. వాళ్లు భగవద్భక్తిప్రబోధకాలైన సంకీర్తనలు చక్కగా గానం చేస్తూ మైమరచి, నృత్యం చేస్తూ, ప్రపంచమంతా తిరుగుతున్నారు. ఓచపలచిత్తుల్లారా! మీ మనస్సును నిలిపి, ఆ భకుల్ని

ఆశ్రయించి, జీవించండి" అని నిశ్చలజ్ఞానంతో సంసారుల్నిగూర్చి చెప్పేమాటలు వినండి.


భగవంతునిభక్తులు తమప్రేమతో వ్యాధి-ద్వేషం-ఆకలి-మొదలైన దోషాలలతో కూడిన రాక్షస సంపదనంతా పోగొట్టి, సమరసాన్నీ, సన్మార్గాన్నీ చూపుతారనీ - అందరికీ సుఖాన్ని ఇచ్చే దైవసంపదను ఇస్తారనీ- ఇందుకుగాను ప్రజలంతా భక్తిమార్గంలో కలిసిమెలసి పనిచేయాలనే ప్రబోధాన్ని నమ్మాళ్వార్లు తమపాశురాలలో నిగూఢంగా దాచి ఉన్నారు.

నమ్మాళ్వార్లు ఈ స్వప్నజగత్తులో - తన లక్ష్యమైన ఆ భగవంతుణ్ణి -

"చూచినాము! చూచినాము! చూచినాము! నేత్రానంద కరుడైన ఆభగవంతుణ్ణి చూచినాము" అని కుతూహలంతో గంతులు వేస్తూ చూపుతున్నారు. మీరూ చూడాలని ఆయన కోరిక! కానీ మీకు శక్తి చాలలేదు. ఆ శక్తిని వీరియోగ మార్గాన్ని- భక్తిమార్గాన్ని - ప్రేమమార్గాన్ని అనుసరించి పొందండి. ఆ శక్తిని పొందినరోజు మీరు నమ్మాళ్వార్లవలే ఆ ఆనందాన్ని పొందగల్గుతారు.

ప్రపంచంలోని భక్తిమార్గప్రవర్తకుల్లో నమ్మాళ్వార్లకు ఒక ప్రముఖస్థానం ఉంది. వీరిఅవతారంవల్ల తమిళదేశం పునీతమైంది. వీరిఉపదేశంవల్ల భారతదేశం జ్ఞానసంపదను పొందింది. వీరిని "తమిళ్‌మారన్" అనీ, "వేదం తమిళ్‌శైద మెయ్యన్" అనీ శ్రీవైష్ణవ పరమాచార్యులు సెలవిస్తారు. అయితే వీరు ఒకదేశానికీ, ఒక మతానికీ చేరినవారు కారు. వీరు భక్తిమతం, యోగమతం, ప్రేమమతం - అనే విశిష్ట త్రివేణీ సంగమానికి చేరినవారు.

(అయిపోయింది)



డా॥ చిన్నలక్ష్మి కళావతి, 99633 39301

నరుడు నారాయణుణ్ణి ఎందుకు? ఏమని ప్రార్థించాలి?

– ఎం.సరోజమ్మ, మైదుకూరు.

చర అచరాత్మకమైన విశ్వమంతా ఏదో ఒక దివ్యశక్తివల్ల రూపొంది, వృద్ధిచెంది, చివరకు లయిస్తుంది. మనది కర్మ భూమి. ఇక్కడ ఏ కర్మా చేయక ఒక్క క్షణమైనా ఉండడానికి వీల్లేదు. కర్మలవల్ల ఏర్పడే ఫలాలే జీవుల (మానవుల) సుఖ దుఃఖాలకు కారణం. సాధారణంగా మన పనులు మనమే చేసుకోవాలి. మనవల్ల కాకుంటే సహాయం చేసేవాళ్లనుండి నిర్వహించుకోవాలి. అప్పటికీ కాకుంటే – మనందరిపై ఉన్న ఒక భగవత్‌శక్తిని ఆశ్రయించాలి. శక్తికి శక్తి ఉంటుంది. కానీ రూపం ఉండదు. ఆ శక్తి ఏ ఉపాధిలో (వస్తువులో) ప్రవేశిస్తే– ఆ వస్తురూపంతోనే ప్రకాశిస్తుంది. కార్యాలు నిర్వహిస్తుంది. కనుక మనవల్ల–మన మిత్రులవల్ల మనకార్యాలు సఫలం కానప్పుడు–మనకంటే మహత్తరశక్తిని ఆశ్రయించాలి. ఆ శక్తియే శ్రీమన్నారాయణుడు. ఆయన సాకార, నిరాకార పరమాత్మ, విశ్వవ్యాపకుడు. విశ్వపతి. కర్మలు ఫలవంతం కావాలంటే అందుకు 1)దైవానుగ్రహం 2) పురుషప్రయత్నం 3)అదృష్టం– అనే మూడుశక్తులు కావాలి. ఇందులో దైవానుగ్రహం, అదృష్టం– కంటికి కన్పించవు. పురుషప్రయత్నం–జీవి చేసే ప్రయత్నం. ఇదే మనకు గోచరించేది. మానవప్రయత్నంకంటే దైవానుగ్రహం, అదృష్టం అనేవి గొప్పవి. కనుక కార్యసాఫల్యానికై దైవాన్ని ఆశ్రయించాలి. స్తుతించాలి. జపించాలి. కీర్తించాలి. సేవించాలి. ఏదోవిధంగా భగవంతుని దయకు పాత్రులు కావాలి. ఇందుకుతోడూ జన్మాంతరాలలో జీవులు (మానవులు) చేసిన పుణ్యఫలంకూడా ఆ సమయానికి మనకు అనుకూలిస్తే– దీన్నే అదృష్టం అంటాం. అలా ఇదొక త్రివేణీసంగమం!

భగవద్గీతలో – బాధల్లో ఉండేవాళ్లు, జిజ్ఞాసువులు, ధర్మార్థ కామాలు కోరేవాళ్లు, జ్ఞానులు – నన్ను ప్రార్థిస్తుంటారు”– అన్నారు–గీతాచార్యులు. పైగా వీళ్లందరూ సుకృతినః= పుణ్యాత్ములే అన్నాడు. అంటే ఏవిధంగానైనా భగవంతునిపై మనస్సు లగ్నమైతే చాలు – వాళ్లు పుణ్యాత్ములే!

నారాయణుణ్ణి భౌతికంగా, పారమార్థికంగా ఏమేమి కోరినా – అవన్నీ ప్రశాంతంగా అనుభవించి, ఆనందించాలంటే ముఖ్యంగా ఉండాల్సినగుణం వినయం. వినయం లేకపోతే మన ప్రయత్నాలన్నీ సముద్రంలో కలిపిన చింతపండే! అందుకే నరుడు నిజంగా నారాయణుణ్ణి, ఏమికోరాలో – ఆదిశంకరాచార్యులవారు తమ ‘షట్పదీస్తోత్రం’లో – మొదటిశ్లోకం–మొదటి పాదంలోనే “అవినయ మపనయ విష్ణో!” అన్నాడు. **“నా లోని అవినయాన్ని తొలగించి, వినయాన్ని ప్రసాదించు”**మన్నాడు. వినయంవల్ల మంచి వ్యక్తిత్వం, గౌరవమర్యాదలు, ఇలా ఎన్నో సద్గుణాలు చేర్తాయి. వినయం తర్వాత మనస్సులోని అహంకార మమకారాల్ని తొలగించమని ప్రార్థించాలి. తర్వాత సంసార విషయవిషాన్ని పోగొట్టుమని అర్థించాలి. ఆ పైన సకలజీవులూ దయ కల్గి ఉండేట్లుగా అనుగ్రహించుమని అర్థిం చాలి. ఇలా నారాయణుణ్ణి–మనలో 1)వినయం 2)నిరహంకారం, 3)సంసార విషయాలపై కోరికలేకుండటం, 4)సర్వజీవులూ దయకల్గి ఉండడం – అనే నాల్గువిషయాలకై స్వామివారిఅనుగ్రహాన్ని కోరాలి. ఇవన్నీ లభిస్తే – మనిషి మనీషి అవుతాడు. పునర్జన్మలేని దివ్యస్థితి సిద్ధిస్తుంది.

మాఘమాస వైశిష్ట్యం తెల్పండి?

– కె.కమల, బైరెడ్డిపల్లె.

తెలుగునెలలలో పదవకొండవది మాఘం. చంద్రుడు మఘానక్షత్రంలో ప్రవేశించడంవల్ల ఈ మాసానికి మాఘమాస మనే పేరొచ్చింది. ధార్మికపరంగా ఈ మాసం చాలా మహిమాన్వితమైనది. జపం, వ్రతం, దానం, తపస్సు తదితరాలతో కూడా శ్రీహరిని సంతృప్తి పరచలేమేమో గాని మాఘమాసంలో కేవలం స్నానమాత్రంచేతనే ప్రసన్నుడై భక్తులను సర్వపాపాలనుంచి విముక్తుల్ని చేసి, కోరిన కోరికలన్నీ తీరుస్తాడని పద్మపురాణం

ఉత్తరఖండంలో మాఘమాసమాహాత్మ్యాన్నిగురించిన వర్ణన కనిపిస్తుంది. కాబట్టి మనమందరం మాఘస్నానమాచరించి, విష్ణుపూజ చేసి, మాధవునికృపకు పాత్రులమవుదాం.

మాఘమాసంకోసం ఎదురు చూడనివారుండరు. ఎందుకంటే ఉపనయనం, వివాహాదిశుభకార్యాలకు మాఘమాసం చాలా మంచిది. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన ఈ మాసం ఎంతో పుణ్యప్రదమైంది. అంతేకాదు ఈ మాసంలో ఉన్నన్ని పర్వదినాలు మరే మాసంలోనూ ఉండవంటే అతిశయోక్తి కాదు. చదువులతల్లి సరస్వతీదేవి ప్రాదుర్భవించిన వసంతపంచమి, సూర్యభగవానుడు తన గమనగతిని మార్చుకునే రథసప్తమీ, భీష్మపితామహుడు స్వచ్ఛందమరణాన్ని పొందిన భీష్మైకాదశి, మహాపూర్ణిమగా పేరొందిన మాఘపూర్ణిమ.... ఒకటేమిటి ఈ మాసమంతా పర్వదినాలమయమే! ఈ మాసాంతంలోనే మహాశివరాత్రి వస్తుంది. ఇలా హరిహర ప్రీతిపాత్రమైంది - మాఘం.

ఇంటిలో స్నానం చేసేటప్పుడు గంగాయమునాది దివ్యతీర్థాలను స్మరించుకుంటూ స్నానం చేయాలి. అనంతరం తిలలు, ఉసిరికలు దానం చేయాలి. సూర్యోదయసమయంలో శ్రీమన్నారాయణుడి పాదపద్మాలను ధ్యానిస్తూ స్నానం చేసినవారు దేవతలకుకూడా పూజనీయులవుతారని 'ధర్మసింధువు' పేర్కొంటోంది.

శ్రీశృంగేరి పీఠానికి ఆ పేరు ఎలా ఏర్పడింది.

- జి.గోవిందు, గూడూరు.

శృంగేరిపీఠం-శృంగగిరిగా మనం చెప్పుకునే ఈ దివ్యస్థలంగురించిన ప్రస్తావనపురాణాలలో, కావ్యాలలో కనిపిస్తుంది. త్రేతాయుగంలో అంటే రామాయణకాలంలో విభాండక మునికి తలపై రెండు శృంగాలతో అంటే లేడి కొమ్ములతో ఒక కుమారుడు జన్మించాడు. ఆయన ఋష్యశృంగుడుగా ప్రసిద్ధికెక్కాడు. ఆ మహనీయుడు తపస్సు చేసిన పుణ్యస్థలమే శృంగేరీ పర్వతం.

ప్రపంచమంతటా కాలినడకన చుట్టి, ప్రజలకు జ్ఞానభిక్ష పెడుతూ వస్తున్న శంకరాచార్యులవారు ఒక మండుటెండా కాలంలో శృంగేరీ పర్వతప్రాంతానికి చేరుకునే సరికి ప్రసవవేదన పడుతున్న ఒక మండూకం (కప్ప)కు ఎండ తగలకుండా, ఒక తాచుపాము తన పడగనీడ పడుతున్న ఒక అపురూపదృశ్యం కంటపడింది. జాతివైరాన్నికూడా మరచి, శాంతితో శోభిస్తున్న ఆ ప్రదేశంలోనే శారదాంబవిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే శృంగేరీపీఠం. కేవలం ముప్పదిరెండు సంవత్సరాలుమాత్రమే ఈ లోకంలో జీవించిన శంకరాచార్యులవారు తన జీవితంలో పదిసంవత్సరాలపాటు అక్కడే నివసించారంటేనే ఆ పీఠం పవిత్రతను అర్థం చేసుకోవచ్చు. ఇలా శృంగగిరి- పిదప శృంగేరిగా ప్రసిద్ధికెక్కింది.

నిజంగా శివుడు దిగంబరుడేనా?

- పి.గోపాలకృష్ణ, నూజివీడు.

అయ్యా! ఈ అనుమానం ఎందుకొచ్చింది? ఇటువంటి విషయాలను భక్తి, ధార్మికావగాహనతో చూడాలి.

అంబరాంబరుడు శివుడు! అంటే - ఆకాశాన్ని వస్త్రంగా ధరించినవాడు అనుకోవాలి. ఆదిదేవుడు, మహాదేవుడూ అయిన శుభంకరునికి వస్త్రధారణ ఏమిటి? అలంకరణలు ఏమిటి? ఆ దిగంబరుడే విభూతిలో ఉన్న సత్యశివసుందరాకారుడు -

దిక్+అంబరుడు అందాం, అంటే దిక్కులనే అంబరంగా కలిగినవాడని అర్థం. ఆయన శిరోజాలు ఆకాశమంతానిండి ఉంటాయి- అపుడు ఆ మూర్తికి దిక్కులే వస్త్రాలుగా ఉంటాయి. ఆయన వ్యోమకేశుడు, దిగంబరుడు - అంటే సాకారనిరాకార తత్త్వాలు రెండూ ఆయనే!

సమస్తచరాచరకోటిలోనూ తానే లయాన్వితుడై, ఆత్మస్వరూపుడై, సృష్టిలయకారుడైన శంకరునికి వేరే అంబరాలెందుకు? ఆడంబరాలెందుకు? చెప్పండి.

జగమెరిగిన జంగమయ్యకు వేరే వస్త్రధారణ కావాలా?

"హరహర మహాదేవ" అని ఆయన్ని ముక్తికోసం భక్తితో అర్చించడం తప్ప - భక్తునిహృదయంలో మరో శబ్దవిన్యాసం ఇమడరాదు - అమరరాదు కదండీ!

అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళాలు అధోలోకాలు. భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు ఊర్ధ్వ లోకాలు. వీటితో కూడిన బ్రహ్మాండాలకు ఆవల–తేజోవాయుగగనభూతాది పంచావరణాలకు పైన–విశిష్టమైన ఒక ప్రకృతి మండలముంది. ఆ మండలాన్ని దాటితే అవతల పరాత్పరవాసం. ఈ పరాత్పర వాసాన్ని 'పరవ్యోమ' మంటారు. ఇదే ఆ 'నందకాయుధధారి' నివాసం. నిరతిశయ ఆనందధామం. అదే వైకుంఠం. ఆ భువనంలోని నగరే అయోధ్య. ఆ అయోధ్య–శ్రీహరి రాజధాని. అదే వైకుంఠ నాథునివాసం. ఆ ఆవాసంలోనే ఒక 'సహస్రస్తంభమంటపం'. ఆ మంటపంలో వేయిరేకులపద్మం. ఆ పద్మంకర్ణికమధ్యలో పద్మనాభుడు. లీలామానుషవిగ్రహుడైన స్వామి శ్రీభూనీళలను చిరునవ్వులతో చిలికిస్తున్నాడు. వైకుంఠనాథునికి విమలలోచనలైన విమలాదిసతులు వింజామరలతో మెల్లగా వీస్తున్నారు. అనంతు డొకవంక, పక్షీంద్రుడు మరోవంక, విష్వక్సేనుడు మరోపక్క సేవిస్తున్నారు. చండకుముదాది నిత్యులు, కుంజరాస్యుడు మొదలైన ఘనులు ఊడిగాలకు సన్నద్ధులయి ఉన్నారు. పార్శ్వంలో పంచాయుధాలు సమధికోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. నిత్యులు, ముక్తులు, నిగమసంతతులు చేతులు కట్టుకొన్నవారై కొలువు చేస్తున్నారు. అటువంటివేళ జగదీశ్వరుని సర్వశేషిణి అయిన ఇందిరాదేవి స్వామితో తన సందేహనివృత్తి కోసం ఒక ప్రశ్న అడగదలచుకొంది.

"సరసిజోదర! సర్వజనక! యోగీంద్ర! కరుణామయాత్మ! ఆగమవేద్య! నీవే సృష్టి, స్థితి, లయావస్థలను కల్పించావు. నీ సేవకులైన బ్రహ్మకు, హరునికి బాధ్యతలప్పగించావు. వేదాలు, శాస్త్రాలు సృజించావు. 'కర్మబ్రహ్మలకు' కారణాలు తెలిసేవిధంగా మార్గాలు చూపావు. అయినా జీవకోటి సన్మార్గాలలో వెళ్లకుండా అజ్ఞానంలో మునుగుతూ తేలుతూ కొట్టు మిట్టాడుతున్నారు. తప్పుచేసిన దాసుల మీద రాజు దండెత్తినట్లు – నీవు అవతారాల నెపంతో శిక్షించి, కొన్నిఆత్మలను కరుణిస్తున్నావు. కొందరికి విహిత దుఃఖమా? కొందరికి విగతదుఃఖమా? ఇదేమి న్యాయం? సకల జీవాళినీ ఉద్ధరించే మార్గం నాకు తెలియజేయరాదా' అని ప్రశ్నించింది.



02 – ఆచార్య కె.సర్వోత్తమరావు

వైకుంఠవాసుడు ఇందిరను క్రీగంట చూస్తూ–తన చేతితో అమ్మచేతిని కలుపుతూ 'భళిభళీ' అన్నాడు.

"ప్రాణేశ్వరీ! జీవకోటిసముద్ధరణార్థం వాత్సల్యభావంతో నీవు కలవరపడడం న్యాయమే! నీవు జగన్మాతవు. అయినా నేనుకూడా ఏం చేద్దామా అని ఆలోచిస్తున్నాను. సరిగ్గా ఇదే సమయానికి ప్రశ్నించావు. నేను సమాధానం చెబుతాను. విను–

'పద్మా! నేను చేయగలిగిందల్లా చేస్తూనే ఉన్నాను. జగద్రక్షణార్థం నానావతారాలు ఎత్తాను. అయితే అవతారాలెత్తిన వేళ కొందరు బ్రహ్మస్వరూపమని కొలిచారు. మరికొందరు సామాన్యమిత్రుని గానే నాతో సహవాసం చేశారు. ఇంకా కొందరు అకారణద్వేషంతో వైరభావం ప్రదర్శించారు. మరొక చిత్రమేమిటంటే సర్వలోకాధిపతి నయిన నన్ను సామాన్య భూపతిగానే భావించారు. లీలామానుష



విగ్రహుడనయిన నన్ను అమాయకులు అభం శుభం తెలియని బాలునిగా లెక్కగట్టారు. అయినా ఎవరు గానీ నేనేమిటో, నా స్వరూపమేమిటో, నా ధ్యేయమేమిటో తెలుసుకోలేకపోయారు. ఇదే నా వ్యథ. అందుకే ఇదొక్కటే మార్గం కాదనుకొన్నాను. అంచేత జీవకోటి ఆత్మలకు దేహాలు, ఇంద్రియాలు ఇచ్చాను. అయినా వారు వాటి ప్రయోజనాలను తెలుసుకోలేకపోయారు. దేహాన్ని, ఇంద్రియాల్ని తుచ్ఛ సుఖసంతోషాలకోసం వాడుకొంటున్నారు. నా నిజస్వరూపాన్ని దర్శించలేకపోతున్నారు. కత్తి ఇస్తే ఆవులతోకలను తెగటార్చినట్లు ఆత్మవినాశనానికి తామే కారకులవుతున్నారు. రాక్షసప్రవృత్తులతో విజృంభిస్తున్నారు. రాట్నంగుండ్రంలాగా పైకి, కిందికి తిరుగుతూ వాసనావిష్టులై పరిభ్రమిస్తున్నారు. తమ కర్మల కారణంగా నరకవాసం అనుభవిస్తున్నారు. 'పునరపి జననం పునరపి మరణం' లాగా అనేకానేకజన్మలెత్తుతున్నారు. ఆత్మోద్ధరణ చేసుకోలేని వారిని నేనేలా ఉద్ధరిస్తాను? అయినా ఒక ఉపాయం సూచిస్తాను-విను. నేను ఆ జీవకోటిలో అంతర్యామి అవుతున్నాను. శ్రీరంగం, కంచి, తిరుమలాది దివ్యదేశాలలో అర్చావతారమూర్తులుగా వెలసి, అర్చనలతో జీవకోటికి సుముఖుడిగా ఉంటాను. ఇళ్ళముంగిట పెంచిన లేళ్ళను చూపి, అడవులలోని జింకలను వశ్యం చేసుకొనేలాగా సజాతీయులద్వారా ఆ జీవులను వశపరచుకొంటాను.

కమలాయతాక్షి! ఆలకించు. నీవు, భూదేవి, నీళాదేవి, ఆలాగే పంచాయుధాలు, గరుడ అనంత విష్వక్సేనాదులు, శ్రీవత్సకౌస్తుభాదులు, వైకుంఠంలోని నిత్యులు, భూలోకంలో విభిన్నజాతులలో జన్మించాలి. ఒక చోటనక అనేకప్రదేశాలలో అవతరించాలి. అంతేకాదు అనేక భాషలు నేర్చుకోవాలి. అసంఖ్యాకమైన కావ్యాలు రచించాలి. వేదాలు, వేదాంతాలు, నన్ను కీర్తించే వాఙ్మయమంతా ద్రవిడభాషల్లో గేయాలుగా, సంకీర్తనలుగా, రసస్ఫూర్తిగా, సహృదయైకరంజకంగా వ్రాయబడాలి. పాడబడాలి. ఈ వాఙ్మయ రాశితో పైపై మెరుగులను ఆదరించే, ప్రోత్సహించే, ఆకర్షించే వాదాలను అణచాలి. సంసారమనే అడవిలో తిరిగే ఏనుగులలాంటివారిని కట్టుకంబాలకు కట్టిపడేసేరకంగా భక్తిప్రపత్తిమార్గాలను విశదం చేసి, పరమార్థమైన పరాత్పరుణ్ణి తెలుసుకొనేలా చేయా"లని ఉపదేశమిచ్చాడు.

స్వామి ఆనతి విన్న లక్ష్మీదేవి 'స్వామీ! మీ ఆన శిరోధార్యం! అయినా భూలోకంలో జన్మించి, ద్రావిడభాషలో ప్రబంధరచన చేయవలసిందిగా ఆదేశించడానికి కారణమేమిటి? అని ప్రశ్నించింది.

నారాయణుడు ఆమెను చూచి - 'నిజమే! నేను అలా కోరినందుకు, ఆనతిచ్చినందుకు కారణం చెబుతాను. ఒకసారి కౌశికాపురిలో-గంగానదీతీరంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణానికి సర్వం సన్నద్ధమయింది. ఆ కల్యాణసందర్భనార్థం. దేవతలు, మునులు కదిలారు. అసంఖ్యాక జన సమూహం కారణంగా ఉత్తరభూభాగం క్రుంగిపోయింది. దేవతలు ఆశ్చర్యపడ్డారు. ఏమవుతుందో అని దిగాలు పడ్డారు. వెంటనే దేవశిల్పి విశ్వకర్మను పిలిపించారు.

"దేవశిల్పీ! ఈ వింత చూశావా? ఉత్తర భూభాగం క్రుంగడమేమిటి? ఈ విపరీతాన్ని చక్కదిద్దడానికి ఏదైనా ఉపాయం చెప్పగలవా?" అని ఉత్కంఠతో ప్రశ్నించారు.



తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

తేదీలు	పగలు ఉత్సవములు	రాత్రి ఉత్సవములు
28-02-2016	--	మూషికవాహనంపై వినాయకస్వామి అంకురార్పణం
29-02-2016	(పల్లకీఉత్సవం) ధ్వజారోహణం	హంసవాహనం
01-03-2016	సూర్యప్రభవాహనం	చంద్రప్రభవాహనం
02-03-2016	భూతవాహనం	సింహవాహనం
03-03-2016	మకరవాహనం	శేషవాహనం
04-03-2016	అధికారనంది	తిరుచ్చిఉత్సవం
05-03-2016	వ్యాఘ్రవాహనం	గజవాహనం
06-03-2016	కల్పవృక్షవాహనం	తిరుచ్చిఉత్సవం
07-03-2016	రథోత్సవం	నందివాహనం (మహాశివరాత్రి)
08-03-2016	పురుషామృగవాహనం	(కల్యాణోత్సవం) అశ్వవాహనం
09-03-2016	సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి	ధ్వజావరోహణం, త్రిశూలస్నానం రావణాసురవాహనం

అపుడు దేవశిల్పి – "దేవతలారా! నా మాట వినేటట్లు అయితే తప్పక చెబుతాను. ఈ గండంనుండి బయటపడాలంటే ఒకే ఒక ఉపాయముంది. తపోధనుడయిన అగస్త్యులవారిని ప్రార్థించి, దక్షిణం వైపు పంపడమే! అప్పుడు ఈ క్రుంగుదు ఉండదు. యథాస్థితిగా భూతలముంటుంది"–అన్నాడు. దేవతలు కుంభసంభవుడైన అగస్త్యునిదగ్గరకి వెళ్లి – భూమి క్రుంగడం, విశ్వకర్మఆలోచనలు మనవి చేశారు. దేవతలమాటలు వినగానే అగస్త్యుడు మండిపడ్డాడు.

విశ్వకర్మను చూచి–"విశ్వకర్మా! ఏమిటీ నీ కుటిల ఆలోచన? ఈ వక్రోక్తు లేమిటి? పార్వతీపరమేశ్వరులకల్యాణం చూచి, పరవశించాలని–కాశిలోనే స్థిరనివాసమేర్పరచుకొని, ఎదురు చూస్తుంటే నాకు ఆటంకాలు సృష్టిస్తున్నావా? ఓరీధూర్తా! విను ఈ కుటిలోపాయానికి శిక్ష అనుభవించవలసిందే! ఇకపైన నీకూ, నీ వంశంవారికీ 'పని ఎక్కువ అవుతుంది' అని శపించాడు.

విశ్వకర్మ ఎదురుచూడని పరిణామం!

విశ్వకర్మ చేతులు జోడించాడు. ఎదురుదాడికి సిద్ధమయ్యాడు.

"మహర్షీ! ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. దేవత లందరు కలిసి నన్ను పిలువనంపారు. అనుకోని విపరీతపరిస్థితులనుండి గట్టెక్కడానికి ఉపాయం అడిగారు. నేను చెప్పాను – అంతే! ఉపాయం చెప్పినందుకు నాకూ, నావారికీ శాపమా?

అయినా నేనూ నీకు శాపమిస్తున్నా!

చపలాత్మా! నీవు సదా అధ్యయనం చేసే వేదాలకు ద్రావిడత్వం సిద్ధించుగాక" అన్నాడు.

ఈ ఇరువురి శాపప్రతిశాపాలతో దేవతలు నివ్వెరపోయారు. తమలో తాము ఆలోచించుకొని, దేవతలు వారిద్దరినీ శాంతింపజేశారు. "మహర్షీ! నీవు లోకోత్తరమైన కార్యాలు నెరవేర్చడానికే జన్మించినవాడివి. పరోపకారంకోసం పరితపించేవాడివి. మీకూ, కాశికీ ఉన్న అనుబంధం మాకు తెలియందేమీ కాదు. పార్వతీపరమేశ్వరులకల్యాణం వీక్షించాలనే మీ తపన మాకు తెలుసు. అయినా భూతలమే క్రుంగుతుంటే కాశి ఎక్కడ? కల్యాణ

మెక్కడ? అయినా విశ్వకర్మను మేమే పిలిపించాం. అతను నిమిత్తమాత్రుడు. ఏం చేద్దాం?జరగవలసిందేదో జరిగిపోయింది. మీరు దక్షిణభూభాగానికి కదలండి. ఇదే మా ప్రార్థన" - అంటూ చేతులు జోడించారు - దేవతలు.

అగస్త్యుడు ఏమీ అనలేకపోయాడు. అంతా శివాజ్ఞ!! పైగా దేవతల సంప్రార్థనం. అంచేత కాశికి నమస్కరించి, ఆవేదనతో దక్షిణానికి నడిచాడు.

మలయాద్రిదగ్గర ఆగాడు. అక్కడి పవిత్రవాహినిలో స్నానం చేశాడు. వెయ్యిన్నూరు దివ్యసంవత్సరాలు నాకోసం తపస్సు చేశాడు. నేనూ సంతోషించాను. ఆ మహర్షి తపస్సు మన్నించాలనుకొని అతనిముందు సాక్షాత్కరించాను.

"మహర్షీ! నీ తపస్సు అమోఘం! అనుపమానం! నీ పరోపకారచింతన అంతకంటే ప్రశంసార్హం. నీకు తపః ఫలితమివ్వడానికే వచ్చాను" అన్నాను. అప్పుడు అగస్త్యమహర్షి-

"పద్మనాభా! నేను కాశిలో ఉండడం తప్పా? పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని తనివితీరా, కనులారా చూడాలని కోరుకోవడం తప్పా? ఎవరికీ ఏలాంటి అపాయం తలపెట్టని వాణ్ణే! అయినా నాపట్ల ఆ దేవశిల్పి విశ్వకర్మ కెందుకీ కక్ష? ఏమయితేనేం? దేవతల మాట కాదనలేక కదలివచ్చా. అయినా నా వేదాలకు ద్రావిడత్వమా? సుస్వరాలతో అధ్యయనం చేసే వేదబుక్కులకు ద్రావిడానువాదామా?" అని పరితపించాడు.

అపుడు నేను

'మహర్షీ! నీ ఆవేదన అర్థం చేసుకోగలను. వేదాలకు ద్రావిడత్వం వచ్చినా అవి ద్రావిడాగమాలే! వేదసారాలే! ఈ సారాన్ని ద్రవిడభాషలో మునులచేత పాశురాలుగా పాడిస్తాను. ఇది వరకే నా అనుచరగణాన్ని ద్రావిడదేశంలో జన్మించవలసిందిగా అనుజ్ఞ ఇచ్చాను. ఆలాగే మహర్షీ! మీరూ ద్రవిడమండలానికి కదలి వెళ్ళండి, అని ఆనతిచ్చాను.

మహర్షులవారు ఆలాగే దక్షిణదిక్కుకు అడుగులు వేశారు. తదనంతరం రమానాథుడు శేషాచలం, శ్రీరంగం, కాంచీపురంలాంటి పవిత్రక్షేత్రాలలో (భక్తజనులను అనుగ్రహించదంకోసం) అర్చామూర్తులుగా సాక్షాత్కరించారు.

(సశేషం)







పుట్టగానే...
పరిమళించిన
భక్తికుసుమం

1

శ్రీ జనాబాయి

–డా॥ పోరంకి దక్షిణామూర్తి

భక్తి -
హృదయానికి సంబంధించింది;
తెలివి -
మెదడుకు సంబంధించింది.
మనిషికి...
ఈ రెండూ ఉండడం అవసరమే!

కొందరిలో.....
ఒకటి ఎక్కువగా ఉంటుంది.
ఒకటి తక్కువగా ఉంటుంది.

వాటిలో....
ఎక్కువగా ఉన్నదే..
మనిషి జీవితాన్ని
తన పద్ధతిలో నడిపిస్తుంది.
రెండోది ఉండదని కాదు;
ప్రధానంగా పనిచేయదు - అంతే!

ప్రశాంతమైన పరిసరాల్లో సన్నగా ఎవరైనా పాడుతూ ఉంటే ఆ రాగంలోనినాదం మన చెవిని ఆకట్టుకొంటుంది. తాపంవల్ల వాతావరణం చిరాకుపెడుతూ ఉంటే చల్లని పిల్ల తెమ్మెరలు వచ్చి సోకినప్పుడు ఒంటికి హాయిగా ఉంటుంది. చెట్లగుబుర్లలో, పెనవేసుకొని తీగలతో ఉయ్యాలలూగుతూ గుత్తులుగుత్తులుగా వన్నెవన్నెలపూలు విచ్చుకొన్నప్పుడో, అద్భుత నైపుణ్యంతో తీర్చిదిద్దిన అపూర్వ కళాఖండం ఒకటి కంటబడి నప్పుడో, అవయవాల పొందికతోను, సుందరమయిన రూపరేఖ విలాసాలతోను ఒక మానవాతీత మహాశిల్పిచేతిలో రూపుదాల్చిన రమణీయశిల్పంలాంటి వ్యక్తి మనకు తారసపడినప్పుడో– ఉత్సాహంతో పరవళ్లు తొక్కుతూ వచ్చి ఉవ్వెత్తున లేచి చూచి వేచి ఉండలేక, ఒడ్డుకు చేరి ఇసుకపాన్పున పవ్వళించ జూచే కడలికెరటం కంటికి కనిపించినప్పుడో, ఆకాశంఅంచునుంచి జారివచ్చినట్లు సాహసబాలికలా అగాధపు లోతుల్లోకి గెంతే జలపాతంఆటల దూకుడు చూచినప్పుడో – సరికొత్త రుచుల రసాల పాయసాలతో నాలిక సొక్కినప్పుడో, అనుకోనివేళ అనుకోని సుగంధం గాలి తరగలమీద తేలిఆడుతూ వచ్చి, ముక్కుపుటాలను మురిపించినప్పుడో మైమరచిపోతాం మనం. ఆ నాదం, ఆ స్పర్శం, ఆ రూపం, ఆ రసం, ఆ గంధం మన మనస్సును అలరించినప్పుడు, ఆ అనుభవం మళ్లీ మళ్లీ కలుగుతున్నప్పుడు – ఇంకా ఇంకా కలగాలనిపించినప్పుడు వాటిమీద మనకు ప్రేమ పుట్టినట్టు! వాటిలో ఏ ఒక్కటైనా చాలు– మనగుండెను హత్తుకోడానికి!

పసిపాపల బోసినవ్వుల పలకరింపులు, అన్నదమ్ముల ఆప్యాయతల చిలకరింపులు, అమ్మఒడిలో గిలిగింతల పులక రింపులు – ఇవన్నీ మనసును ఉర్రూతలూపుతూండేవే! ఈ సుఖం అమూల్యమయింది.

ఇది మనకందరికీ అనుభవంలో ఉన్నదే. ఈ సుఖానికి ప్రేరణ బయటినుంచి వస్తుంది. ఇది కాక మరొకటి ఉంది. ఇది మనలో లోలోపలినుంచి వెలువడేది. ఈ ప్రేమలో ఉన్న సుఖం, బాహ్యప్రేరణలవల్ల కలిగేదానికంటే గాఢంగా ఉంటుంది. బలంగా ఉంటుంది. ఒక వ్యక్తిమీదో, వస్తువుమీదో, దృశ్యంమీదో కలిగేది కాక, తల్లిగానో, తండ్రిగానో, ప్రభువుగానో, సఖుడిగానో, సఖిగానో, బిడ్డగానో భగవంతుడిమీద కలిగే గాఢమైన ప్రేమను భక్తి అంటాం. ఈ భక్తికి జాతి, మత, కులాది భేదాలతో ప్రమేయంలేదు. స్త్రీపురుష వ్యత్యాసం సంబంధం లేదు. వయస్సుతోనూ నిమిత్తం లేదు. చదువు సాములవంటివి అసలే అక్కరలేదు. కొందరికిది చిన్న వయస్సులోనే బయలుపడుతుంది. కొందరిలో పెరుగుతూ వచ్చిన తరవాత బయటపడుతుంది. ఈ రెంటిలోను, చిన్నవయసులో బయటపడేదే మేలని అందరికీ తెలుసు.



చిన్నవయస్సులోనే భక్తి ఏర్పడట మనేది పూర్వజన్మ సుకృతమేనని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఏమంటే - మనిషి జన్మఎత్తినతరవాత భక్తి ఏర్పడట మనేదే పూర్వజన్మపుణ్య ఫలం. మనిషిలో పరిపక్వత ఏర్పడ్డప్పుడు అది సిద్ధిస్తుంది. పరిపక్వతా కాలం ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా ఉంటుంది. ఆ పరిపక్వత పూర్వజన్మలోనే చాలావరకు ఫలోన్ముఖమయినప్పుడు అది ఈ జన్మలో చిన్నతనంలోనే సిద్ధిస్తుంది. కొందరికి భక్తి దానంతట అదే కలుగుతుంది; కొందరికి బయటిప్రభావాలవల్లా కలుగుతుంది. ఇంట్లో పెద్దవాళ్ళు (తల్లిదండ్రులు, అన్నలు, అక్కలు, ఇతర బంధువులు) భక్తిశ్రద్ధలు కలవాళ్లయితే- పూజాపురస్కారాలు, జపధ్యానాలు, ధార్మికోత్స వాలు, భజనలు, భాగవతసేవ, దీననారాయణ సేవ వంటివి చేసేవాళ్లయితే - వాళ్లు పాటించే ఆచారాల ప్రభావం, చేసే పనుల ప్రభావం, చెప్పే మాటల ప్రభావం, నడిచే నడవడి ప్రభావం - పిల్లల లేతమనస్సులమీద తప్ప కుండా, గాఢంగా పడతాయి. దానిఫలితంగా, పిల్లలకు క్రమశిక్షణ అలవడుతుంది. జన్మాం తరవాసనలు స్మృతికి వచ్చి, వాళ్ల హృదయాల్లో భక్తి మొలకెత్తుతుంది. ఇంట్లోవాళ్లు పూర్తిగా లౌకికవ్యాసంగాల్లో మునిగితేలుతూ ఉండి, దైవభక్తి బొత్తిగా లేనివాళ్లయిన సందర్భాల్లోకూడా, వాళ్లింట్లో పిల్లలకు, చుట్టుపక్కలున్నవారి వల్లో, చుట్టాలవల్లో, స్నేహితుల వల్లో, భక్తిని రగులుకొలిపే దృశ్య శ్రవ్య కళాప్రదర్శనలవల్లో, పుస్తక పఠనంవల్లో చిన్నప్పుడే భక్తి కుదురుకోవచ్చు. ఎవరికి ఏ తీరుగా ప్రేరణ కలుగుతుందో చెప్పలేం. కారణం ఏదయి నప్పటికీ భక్తి అనేది ప్రధానం.

ఇది కుదిరినవాళ్ల జీవితాలు ఎలా ధన్యమయ్యాయో మనకు భక్తుల కథల్లో తెలుస్తుంది. ఆ కథలు మనమెరిగిన మామూలు కథల్లా ఉండకపోవచ్చు. అనేక అలౌకిక సంఘ టనలూ, అత్యంతాశ్చర్యకరమయిన అద్భుతాలూ జరిగినట్లు కూడా ఈ కథల్లో కనిపిస్తుంది. వీటిల్లో అతిశయోక్తులు ఉండవచ్చుకాని పరమేశ్వరుడి అనుగ్రహానికి అసాధ్యమయిన వేవీ ఉండవు. అసహజ / అహేతుక ఘటనలుగా కనబడేవాటికి కూడా భక్తుల జీవితకథల్లో ప్రయోజనం ఉంటుంది. వాటిని ఆ దృష్టితోనే చూడాలి కాని మనకున్న తెలివితో విశ్లేషించడం



తగదు. ఇటు భక్తజనహృదయాలనూ- అటు భక్తపరాధీనుడి అనుగ్రహాన్నీ సమన్వయంచేసుకోవడమే కావలసింది.

కాశీమజిలీకథలూ, అల్లావుద్దీన్ అద్భుతదీపం, మాయతి వాసీలు వంటి కథలూ ఈనాటి సైన్స్ ఫిక్షన్ కథలూ వంటివి చదివి ఆనందించేవాళ్లు ఎప్పుడూ ఉంటున్నట్లుగానే భక్తులకథలు చదివి ఆనందించేవాళ్లు కూడా ఎప్పుడూ ఉంటారు. మొదటి రకం కథలు కేవలం వినోదం కలిగిస్తాయి. భక్తులకథలు జీవిత పరమార్థాన్ని ఉద్బోధిస్తాయి. అలాంటివాటిలో జనాబాయికథ ఒకటి. ఈ కథకు రంగస్థలం పండరిపురం.

పండరిపురం అనగానే పాండురంగవిఠ్ఠలుడు గుర్తుకు వస్తాడు. శ్రీకృష్ణభగవానుడే పాండురంగడు కనక, ఆయన దేవేరిపేరు రుక్మిణీదేవి. మహారాష్ట్రంలో చంద్రభాగానదీ తీరంలో విఠ్ఠలనాథుడిఆలయం విరాజిల్లుతూ ఉంది. దేశంలో ఎక్కడెక్కడి నుంచో భక్తులు ప్రతిరోజూ పండరిపురానికి యాత్రగా వస్తూం టారు. ప్రత్యేకంగా కొన్నిఉత్సవాలు జరిగే రోజుల్లో ఇంకా విరివిగా వస్తూంటారు. అలాంటి ఉత్సవాల్లో కార్తికోత్సవం ఒకటి. కన్నుల పండువుగా జరిగే ఆ ఉత్సవంలో పాండురంగడి రూపయశోవైభవాలను తిలకించడానికి రెండు కళ్ళు చాలవు. ఆ దర్శనభాగ్యమే భాగ్యంగా, అది కలిగిన జన్మమే ధన్యంగా భావించేవాళ్లు ఉన్నారు. అందువల్ల కార్తికోత్సవానికి తప్పకుండా వస్తారు.

అలా పండరిపురానికి వచ్చిన ఒక కుటుంబంలో జనా బాయి అనే చిన్నఅమ్మాయి ఉంది. ధగధగ మెరిసే వస్త్రాలం కారాలతో, మిలమిల మెరిసే కళ్ళకాంతితో, గుమ్మని సోకే పూలవాసనలతో విలసిల్లే రుక్మిణీనాథుల వైభవాన్ని చూస్తూ మైమరచి నిలిచిపోయింది- జనాబాయి. ఆమె మైమరపు చూచి, తల్లీ తండ్రీ ఆనందించారే కాని ఆమెమనసును మళ్ళించి పండరినాథుని సన్నిధిలోంచి వెలుపలికి తీసుకురావడానికి ఎంతో శ్రమపడవలసి వచ్చింది. బయట ఒక మంటపంలో కూర్చోపెట్టి కూతురికి ప్రసాదం పెట్టారు.

"అమ్మా! పాండురంగడంటే ఎవరు?" అని అడిగింది - జనాబాయి.

"దేవుడు", అనింది తల్లి.

"దేవుడంటే?"

"అందరికీ తండ్రి. మీ నాన్నగారున్నారు చూడు - ఆయన నీకు తండ్రి.అలాగే నీకూ నాకూ మీ నాన్నగారికీ - అందరికీ తండ్రి పాండురంగడు!"

"అందరికీనా? ఇక్కడున్నవాళ్ళందరికీనా? ఈ ఊళ్ళోవాళ్లం దరికీనా? అంటూ ఆశ్చర్యంగా అడిగింది - జనాబాయి.

"ఔనమ్మా! ఈ ఊళ్ళోనే కాదు - అన్ని ఊళ్ళలో, అన్ని దేశాల్లో ఉన్నవాళ్లందరికీ ఆయనే తండ్రి." అనింది- ఆమెతల్లి.

జనాబాయి కళ్ళుపూర్తిగా విప్పార్చి ఆశ్చర్యంగా చూచింది. "రుక్మిణి ఎవరు?" అని అడిగింది.

"రుక్మిణి మనందరికీ తల్లి. నేను నీకు అమ్మను కదా! అలాగే రుక్మిణి అందరికీ అమ్మ అన్నమాట!" అనింది-ఆమె తల్లి.

"ఇంక లేవండి! మనం మూటా ముల్లే సర్దుకుని బయలు దేరాలి," అన్నాడు- జనాబాయితండ్రి.

"ఎందుకు?" అని అడిగింది-అమాయకురాలు జనాబాయి.

"దేవుణ్ణి చూశాం కదా! ఇక్కడ ఉత్సవం అయిపోయింది కదా! ఇంక మన ఊరికి వెళ్ళిపోవాలి!" అనింది - తల్లి.

"ఎందుకు?" అని అడిగింది మళ్ళీ, జనాబాయి.

"ఎందుకేమిటి? వచ్చిన పని అయిపోయింది కదా! మన ఊరికి మనం వెళ్లిపోవద్దూ?" అన్నాడు తండ్రి.


"వొద్దు! నాకిక్కడే బాగుంది", అనింది- కూతురు, మూతి ముడుచుకొంటూ. అంతలో ఒక ముత్తయిదువ వాళ్లున్నచోటికి వచ్చింది. ఆవిడదీ- జనాబాయీ వాళ్ళూ ఉండే ఊరే. ఆవిడకూ వాళ్ళకూ చుట్టరికంకూడా ఉంది. ఆవిడ జనాబాయిదగ్గరికి వచ్చి కూర్చుని, ఆమెముఖం పొదివి పట్టుకొని ముద్దు పెట్టు కుంది.

"పాపా! దేవుణ్ణి బాగా చూశావా?" అని అడిగింది - పెద్దావిడ. తల అడ్డంగా తిప్పింది - జనాబాయి.

"ఏమే అమ్మాయ్! నీ కూతురికి దేవుణ్ణి సరిగా చూపించ లేదూ?" అని అడిగింది - ఆవిడ.

"చూపించకేం పిన్నిగారూ! ఎంతెంత సేపు చూచినా, ఎన్ని సార్లు చూసినా దానికి తనివి తీరడంలేదు. తనకిక్కడే బాగుందట. మన ఊరికి వెళ్ళిపోదాం రావే! అంటే రానం టోంది," అని ఆవిడకు ఫిర్యాదు చేసింది-జనాబాయి తల్లి.

(ఇంకా ఉంది)



శ్రీ వేంకటేశ్వరస్వామివారు
అలంకారప్రియుడు, ఉత్సవప్రియుడు
అంతేకాదు ప్రసాదప్రియుడుకూడా!
అందుకే నిత్యకైంకర్యం నిత్యనివేదనం

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యకల్యాణ చక్రవర్తి. శ్రీవారిఆలయం నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతూ ఉంటుంది. స్వామివారికి ఏడాది పొడగునా ప్రతిరోజు ఒక ఉత్సవమే, ప్రతిరోజు ఒక పండుగే. ప్రతిపూట పాయసాలు పరమాన్నాలతో నివేదనలే.

లడ్డు, వడ, పులిహోర, దధ్యోదనం, నెయ్యిపొంగలి, చక్కెర పొంగలి, కదంబం, దోసెలు, అప్పాలు, జిలేబీలు, తేనెతొళలు, పోళీలు, సుకీయలు, బెల్లం దోసెలు... ఇలా.. రకరకాల భక్ష్యభోజ్యాలు స్వామివారికి నివేదించి భక్తులకు ప్రసాదాలుగా అందిస్తూ ఉంటారు.



తిరుమల తిరుపతి అనగానే వేంకటేశ్వరస్వామి వారితో పాటు గుర్తొచ్చేది శ్రీవారి లడ్డు. కోనేటిరాయునికి అత్యంత ప్రీతికరమైన లడ్డూ కీర్తి విశ్వవ్యాప్తంగా విస్తరించింది. వడ మొదలు చక్కెరపొంగలిదాకా శ్రీవారికి ఎన్ని ప్రసాదాలు నివేదించినా లడ్డూమాత్రం తనకు ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకుంది.



1803 సం॥లో మదరాసు ప్రభుత్వం తొలిసారిగా శ్రీవారి ఆలయంలో తీపి బూందీని (లడ్డు పొడి) భక్తులకు ప్రసాదంగా ఇవ్వడం ప్రారంభించింది. అప్పటినుండే ప్రసాద విక్రయాలు కూడా ప్రారంభమైనట్లు తెలుస్తూంది.

పల్లవరాజుల కాలంలో ప్రసాదాలు మొదలయ్యాయి. రెండవ దేవరాయల కాలంలో ఈ ప్రసాదాలసంఖ్య మరింత పెరిగింది. ఈ సమయంలో మంత్రిగా పనిచేసిన శేఖరమల్లన్న కేవలం ఆలయ ప్రసాదాల కోసమే అనేక దానాలు చేశారు. అప్పుడే శ్రీవారికి 'సంధి నివేదనలు' (నైవేద్యవేళలు) ప్రారంభమైనాయి. స్వామివారికి నైవేద్యం

శ్రీవారి ప్రసాదాలు

ఫోటోలు: ఫోటోగ్రఫీ సెక్షన్, తి.తి.దే., తిరుపతి

– డా॥ నొస్సం నరసింహ ఆచార్య





చేసిన ప్రసాదాలను ఆయా సమయాల్లోనే భక్తులకు పంచిపెట్టేవారు. తిరుమలగిరులలో అప్పట్లో భోజన సదుపాయాలు లేనందువల్ల శ్రీవారిప్రసాదాలతోనే భక్తులు కడుపు నింపుకొనే వాళ్లు. భక్తులకు అందజేసే ప్రసాదాన్ని 'తిరుప్పొంగలి' అని పిలిచేవారు.

ఆ తరువాతి కాలంలో అనగా **క్రీ.శ.1445 సం॥లో సుకీయం, క్రీ.శ.1455 సం॥లో అప్పం అనేప్రసాదాన్ని, క్రీ.శ.1460 సం॥లో వడ ప్రసాదాన్ని, క్రీ.శ.1468 సం॥లో అత్తిరసం అనే ప్రసాదాన్ని, క్రీ.శ.1547 సం॥లో మనోహరపడి అనే ప్రసాదాన్ని స్వామివారికి నివేదించడం ప్రారంభించారు.** 1933 సం॥లో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక శ్రీవారి ఆలయంలో ప్రసాదాల వితరణ, విక్రయాలను పెంచారు. 1940 సం॥లో లడ్డుపొడిని లడ్డూగా మార్చి భక్తులకు అందివ్వడం ప్రారంభించారు.

దిట్టం అంటే...

శ్రీవారిప్రసాదాల తయారీకి వాడే సరుకుల మోతాదును 'దిట్టం' అని వ్యవహరిస్తారు. ఉదాహరణకు.....

ఒకరోజుకు 2 లక్షల 50వేల లడ్డూల కొరకు ఉపయోగించే దిట్టం వివరాలు సుమారుగా.....

01)	శెనగ పిండి	-	10,500 కిలోలు
02)	నెయ్యి	-	10,000 కిలోలు
03)	పంచదార	-	25,000 కిలోలు
04)	జీడిపప్పు	-	2,000 కిలోలు
05)	ఎండుద్రాక్ష	-	1000 కిలోలు
06)	యాలకులు	-	300 కిలోలు
07)	డైమెండ్ కలకండ	-	520 కిలోలు
08)	బాదామి	-	30 కిలోలు
09)	కుంకుమ పువ్వు	-	50 కిలోలు

1950 సం॥లో తి.తి.దే. ధర్మకర్తలమండలి ఈ దిట్టంను ఖరారు చేసింది. శ్రీవారిఆలయంలో ఆనాటినుండి నేటివరకు సంధి నివేదనవేళలో అనేక రకాలైన పదార్థాలను రుచిగా, శుచిగా వండి శ్రీవారికి నివేదిస్తున్నారు.




అలమేలుమంగ నీ వభినవ రూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మ॥
బ్రహ్మాండనాయకి బ్రహ్మోత్సవ వేడుకలు


అమ్మవారి బ్రహ్మోత్సవం
హంస వాహనం
పల్లకీ ఉత్సవం
ఉత్సవంలో తి.తి.దే. ఉన్నతాధికారులు
చక్కని తల్లికి ఛాంగుభళా...

భక్తులకు నేత్రోత్సవం





పెద్దశేష వాహనం



సింహ వాహనం









మముగన్న మాయమ్మ...

ధర్మో రక్షతి రక్షితః

















02-12-2015 తి.తి.దే. తిరుమలలో నిర్వహించిన
సనాతన ధర్మప్రచార సదస్సు చిత్రచయనిక

శాసనాల్లో శాకపాకాలు

- తితిదే శాసనం సంఖ్య 513 ప్రకారం క్రీ.శ.1544లో ఆలయ ధర్మకర్త అయిన అత్తిలంగు నాయక అనే వ్యక్తికి శ్రీవారి ప్రసాద నిమిత్తం భక్తులు తమ ఉభయానికి సంబంధించిన ధనాన్ని చెల్లించేవారు.
- తితిదే శాసనం సంఖ్య 192 ప్రకారం క్రీ.శ.1514లో శ్రీవారి తిరుప్పొణకం (వెన్‌పొంగల్) ప్రసాదంకొరకు పదివేల నర్పణాలు భక్తులు సమర్పించేవారు.
- తితిదే శాసనం సంఖ్య 247 ప్రకారం క్రీ.శ.1506లో శ్రీవారి అత్తిరసపడి ప్రసాదంకొరకు 840 నర్పణాలు భక్తులు సమర్పించే వారు.

శుక్రవారాభిషేకం తర్వాత రెండవ గంట నివేదనలకుగాను కొందరు భక్తులు శ్రీవారికి క్రింది ప్రసాదాలను సమర్పించుకున్నట్లు తెలుస్తున్నది.

- క్రీ.శ.1496లో అప్పాచ్చి అయ్యంగార్ అనే భక్తుడు రెండు అత్తి రసపడులను (పడి అనగా 52) శ్రీవారికి సమర్పించారు.
- క్రీ.శ.1506లో సిద్ధముశెట్టి అనే భక్తుడు నాయకతళిగై పేరుతో ఒక అప్పాపడిని సమర్పించారు.
- క్రీ.శ.1534లో బండారు శిరుతిమ్మయ్య అనే భక్తుడు ఒక వడపడిని శ్రీవారికి సమర్పించారు.
- క్రీ.శ.1558లో రాయసం కోనప్పయ్యర్ అనే భక్తుడు శ్రీవారికి రెండు అత్తిరసపడులను సమర్పించారు.
- క్రీ.శ.1583లో కుమార తాతాచారియర్ అనే భక్తుడు ఒక అప్పాపడి, ఒక వడపడి, ఒక గోధిపడి, ఒక ఇడ్డిలిపడిని శ్రీవారికి సమర్పించుకున్నారు.

ఈ విధంగా శ్రీవారికి అనేకమంది భక్తులు పలు నివేదనలు సమర్పించుకున్నట్లు వివిధ శాసనాలద్వారా తెలుస్తున్నది.

నిత్యనివేదనలివిగో...

సుప్రభాత సమయంలో తొలి నివేదనగా పాలు, వెన్నముద్ద, చక్కెర నివేదిస్తారు. తోమాలసేవ, కొలువు తర్వాత నువ్వులు, బెల్లం కలిపి దంచిన పిండిపదార్థాన్ని శ్రీవారికి సమర్పిస్తారు. మొదటిగంట అని పిలువబడే తొలి నివేదనలో పులిహోర, పొంగలి, దధ్యోదనంతోపాటు లడ్లు, వడలు, అప్పాలు మొదలైన పదార్థాలను నివేదిస్తారు. ఇవన్నీ కులశేఖరపడికి బయటవైపే ఉండగా ఓడు అనే పగలగొట్టిన మట్టికుండలో వండిన ప్రసాదంగా మాత్రాన్నం / మాత్ర దధ్యోదనం అనే పదార్థాన్ని నివేదిస్తారు. గడ్డపెరుగు, మీగడ,

తిరుమల శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాలు

పులిహోర, క్షీరాన్నం, దధ్యోదనం, నెయ్యిపొంగలి, చక్కెరపొంగలి, కదంబం, మాత్రాన్నం, మొళహోర, శాకరీబాత్, బకాళాబాత్



అన్నప్రసాదాలకు ఒకరోజుకు ఉపయోగించే దిట్టం సుమారుగా...

01)	బియ్యం	-	1000 కిలోలు
	గురువారం	-	1400 కిలోలు (400 కిలోలు తిరుప్పావడ పులిహోరకు)
02)	మిరియాలు	-	20 కిలోలు
	గురువారం	-	28 కిలోలు (తిరుప్పావడ పులిహోరకు)
03)	పెసరపప్పు	-	100 కిలోలు
04)	నెయ్యి	-	150 కిలోలు
05)	ఆవాలు	-	15 కిలోలు
06)	పసుపు	-	4 కిలోలు
07)	ఇంగువ	-	4 కిలోలు
08)	జీలకర్ర	-	20 కిలోలు
09)	శెనగపప్పు	-	30 కిలోలు
10)	బెల్లం	-	350 కిలోలు
11)	చింతపండు	-	70 కిలోలు
12)	ఉప్పు	-	80 కిలోలు
13)	మెంతులు	-	5 కిలోలు
14)	మంచినూనె	-	100 కిలోలు (పులిహోర కొరకు మాత్రమే)



తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీవారి ప్రసాదప్రియత్వాన్ని తెలుపుతూ తమ **'శ్రీ వేంకటేశ్వర శతకం'**లో ఈ క్రింది విధంగా వర్ణించాడు.

అరిసెలు నూనె బూరియలు నౌగులు
జక్కెరమండెగల్ వడల్
బురుడలు, పాలమండెగ లపూపము
లయ్యలమేలుమంగ నీ
కరుడుగ విందు వెట్టు బరమాన్న
శతంబుల సూపకోట్లతో
నిరత వినిర్మలాన్నముల నేతుల
సోనల వేంకటేశ్వరా!

అరిసెలు, నూనె బూరెలు, నువ్వుల ఉండలు, చక్కెరమండిగలు, వడలు, బురుడులు, పాలమండిగలు, పోళీలు, నేతితో చేసిన పంచభక్షపరమాన్నాలు మొదలైనవన్నీ శ్రీవారికి నివేదిస్తారని ఈ పద్యం ద్వారా తెలుస్తోంది.

17వ శతాబ్దానికి చెందిన ఓ కవి శ్రీవేంకటేశ్వరుని భోజనప్రియత్వాన్ని ఈ క్రింది పద్యంలో వర్ణించాడు.

పాలు వెన్న బకాళబాతు దధ్యోదనం
బువుళి యోరెము వెన్న బూరియలును
సరడాల పాశముల్, చక్కెర పులగముల్
నువ్వు మండిగలు, మనోహరములు
అప్పము లిడ్డెన లతిసారముల్ హోళిగల్
వడలు, దోసెలు గల వంటకములు
శాకముల్ సూపముల్ చారు లంబళ్లు
శుద్ధోదనములును, సద్యోఘృతమ్ము
పండ్లు తేనెలు హొబ్బట్లు పచ్చడులును

వెన్న కలిపిన మాత్ర అనే ఈ పెరుగన్నమును మాత్రమే కులశేఖరపడి దాటుకుని శ్రీవారి గర్భాలయం ఆనందనిలయంలోకి తీసుకెళ్ళి నివేదిస్తారు.

మధ్యాహ్నం రెండవగంట నివేదనలో శుద్ధాన్నంతోపాటు మాత్రాన్నం తప్ప పైన పేర్కొన్న పదార్థాలన్నీ నివేదిస్తారు. రెండవగంట అయిన తర్వాత జరిగే నిత్యకల్యాణోత్సవంలోను, వసంతోత్సవంలోను లడ్లు, వడలు, దోసెలు, అప్పాలు, చక్కెరపొంగలి, పులిహోర, నెయ్యిపొంగలి, దధ్యోదనం వగైరాలు నివేదిస్తారు. తదుపరి జరిగే డోలోత్సవం, సహస్రదీపాలంకరణలలో పంచకజ్జాయము అనే పదార్థాన్ని నివేదిస్తారు.

సాయంకాల నివేదనలో భాగంగా దోసెపడి అనే నెయ్యి దోసెలు, మొళహోర, కదంబం మున్నగునవి శ్రీవారికి నైవేద్యం చేస్తారు. ఆ తర్వాత తిరువీసంగంట అనే ప్రత్యేకనివేదనలో చక్కెరపొంగలిని స్వామివారికి నివేదిస్తారు. రాత్రి ఏకాంతసేవలో గోరువెచ్చని పాలు, చక్కెర, పండ్లు, పంచకజ్జాయంతోపాటు 'మేవ' అనే పంచా మృతాన్ని శ్రీవారికి సమర్పిస్తారు.

వారాలు - విశేష నివేదనలు

వారపూజల్లో భాగంగా సోమవారం విశేషపూజలో పెద్ద వడలు, లడ్లు, బుధవారం సహస్రకలశాభిషేకంలో భాగంగా క్షీరాన్నము అనే పాయసం, గురువారం తిరుప్పావడలో 420 కిలోలబియ్యంతో చేసిన పులిహోర, ప్రత్యేకించి జిలేబీలు, తేనెతొళ అనే పెద్ద మురుకులు, శుక్రవారం పోళీలు, సుకీయలు, ఆదివారంనాడు ఆదివార ప్రసాదంగా పిలువబడే చలిపిండి నివేదిస్తారు.

ఇవికాక ఏకాదశి మున్నగు సందర్భాల్లో దోసెలతో పాటు శెనగపప్పు సుండలు, పానకం, వడపప్పు, ధనుర్మాస సమయాల్లో బెల్లపుదోసె నివేదిస్తారు. పైన పేర్కొన్న ప్రసాదాలే కాక సీర, పాయసం, కేసరిబాత్, శాకరీబాత్, బకాళాబాత్, మనోహరం అనబడే లడ్డూలనుకూడా శ్రీవారికి నివేదిస్తారు.

ఈ విధంగా తిరుమల శ్రీనివాసుడు ఎంతటి ఉత్సవప్రియుడో... ఎంతటి అలంకార ప్రియుడో... అంతటి ప్రసాదప్రియుడు కూడా!! భక్తవత్సలుడైన శ్రీనివాసుడు తన దర్శనానికి వచ్చే భక్తుల ఆకలిని తీర్చే నెపంతోనే ఇన్ని రకాల ప్రసాదాలను నైవేద్యంగా స్వీకరిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఇదంతా **ఇతని ప్రసాదమే యిన్నియును** - అనే అన్నమాచార్య సంకీర్తనను గుర్తుకు తేవడం లేదూ....

పర్వం

భీష్మ ఏకాదశి

-డా॥ మైలవరపు శ్రీనివాసరావు

ఏ దుఃఖమూ, ఏ ఈతిబాధలూ లేకుండా జీవితమంతా సుఖమయంగా జరిగే అవకాశమున్న రాజవంశంలో, అందరికంటె ముందుగా పుట్టి, అనుక్షణం సమస్యల నిట్టూర్పుల్ని విడుస్తూ జీవితాన్ని సాగించినా, ఎక్కడా పతితుడుకాని మహోదాత్తుడు- భీష్ముడు.

అయితే జగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువుకు అతిప్రీతి అయిన ఏకాదశీతిథిని, తన పేరిట బహుమానంగా ఆ పరమాత్మనుంచి పొంది, 'భీష్మైకాదశి' అని పిలిచే పర్వదినానికి మూలపురుషుడు భీష్మపితామహుడు. భారతంలో ఇతని కీర్తి అనన్యసామాన్యం.

ఏ వ్యక్తి అయినా మరణించబోయే ముందు, పరమాత్ముణ్ణి స్మరిస్తే మోక్షాన్నిస్తానని పరమాత్మ పలికితే, అలాంటి పరమాత్మ అయిన కృష్ణుణ్ణి తనధర్మవర్తనంతోనూ, తపశ్శక్తితోనూ మరణ కాలంలో తనవద్దకు రప్పించుకుని, ఆయన సమక్షంలోనే సమస్త మానవాళికీ బాధల్ని పోగొట్టే శ్రీవిష్ణుసహస్రనామాలను గానంచేసి, ఆ పరమాత్మసమక్షంలోనే తన పరివారం అంతా చూస్తూండగా మోక్షాన్ని పొందాడు-భీష్ముడు. అంత గొప్పవాడు ఎలా కాగలిగాడో- పరమపవిత్రమైన ఏకాదశి గురించి తెలుసుకోవడం మనకర్తవ్యం.

భీష్ముని అసలు పేరు దేవవ్రతుడు. ఇతనితండ్రి శంతనుడు. తన పుత్రునికి నడియౌవనం వచ్చినకాలంలో ఈ శంతనునికి,

ఫిబ్రవరి 18వ తేది భీష్మఏకాదశి సందర్భంగా......

దాశరాజు కూతురైన సత్యవతిని పెళ్లాడాలనే కోరిక బలీయంగా కలిగింది. తాను పెళ్లి చేయవలసినవయసులో ఉన్న కొడుకు దేవవ్రతునితో తండ్రి శంతనుడిలా అన్నాడు.

ఒక కన్నూ, ఒక పుత్రుడూ ఉండీ లేనట్లే అంటారు- పెద్దలు. అందుకని ఒక్క పుత్రుడివైన నీకు తోడుగా, మఱొకరిని నీకు తమ్ముడుగా ఉండేలా చేద్దామనుకుంటున్నాను. (వివాహం చేసుకుందామనుకుంటున్నాను) అని వావిడిచి (సిగ్గువిడిచి) చెప్పాడు- శంతనుడు.

పెళ్లి చేయవలసిన కొడుక్కు పెళ్లి చేసుకోదలిచాననే వార్త చెప్పిననాన్న - శంతనుడు.



విషయం అర్థమైన దేవవ్రతుడు, సత్యవతితండ్రి దాశరాజు వద్దకు వెళ్లి, ఆయనకోరికకు అనుగుణంగా రెండుప్రతిజ్ఞలు చేశాడు. 1. నా తండ్రికీ, సత్యవతికీ పుట్టిన పుత్రునికే రాజ్యం మొత్తం చెల్లుబాటవుతుంది. 2. నా తండ్రి ప్రస్తుతం ఇష్టపడిన ఆ నా మారుతల్లి సత్యవతిద్వారా పుత్రుణ్ణి కన్నా, నాకు వివాహమైన పక్షంలో ఇబ్బంది కలుగచ్చు కాబట్టి, నేను వివాహమే పరిత్యజిస్తు న్నాను'–అని.

భీష్మమైన (భయంకరమైన) ప్రతిజ్ఞలు చేశాడు కాబట్టి భీష్ము దయ్యాడని అంటారు.

దుర్యోధనునితొడలు విఱగగొడతానని భీముడూ, సైంధవుణ్ణి చంపుతానని అర్జునుడూ చేసిన ప్రతిజ్ఞలుకూడా భీష్మమైనవే కదా! అయితే మఱి 'భీష్మ'డనే బిరుదు 'ఇతనికే ఎందుకు వచ్చిం'? దనేది ప్రశ్న.

ఒక్క పుత్రుడున్నా–అసలు పుత్రులే లేకున్నా ఒకటే అను కున్నాం కదా! 'అపుత్రస్య గతి ర్నాస్తి' పుత్రులు లేకపోతే ఉత్తమ గతులు లేనే లేవని ధర్మశాస్త్రం చెప్తోంది. వివాహం అయి పుత్రులు లేకపోవడం కాదు–భీష్ముని పరిస్థితి. పిల్లలు కలగడానికి ఏ మాత్రం అవకాశమే లేకండా తానై కోరి తెచ్చుకున్న శాశ్వతబ్రహ్మచర్యస్థితి!

ఒక దీక్షతో నిత్య బ్రహ్మచర్యం అవలంబించే మహర్షులకూ, మంత్రపూర్వకంగా ఆశ్రమస్వీకారాన్ని చేసినసన్న్యాసులకూ మోక్షం వచ్చే వీలుందిగానీ, తనలా వివాహానికి అవకాశముండీ, కావాలని మానినవాళ్లకు లేదు. అందుకే పై నుంచి దేవతలంతా పూలవాన కురిపిస్తూ 'భీష్ముడు' అనే బిరుదనామంతో ఆయన్ని పిలిచారు.

'1. వేదధర్మానికి విరుద్ధంగా వివాహం చేసుకోకపోవడం, 2.భవిష్యత్తులో సంతానం ఉండే వీలులేని కారణంగా ఉత్తమగతు లను కోల్పోవడం, 3.సన్న్యాసదీక్షను తీసుకుని ఎలాగో మోక్షాన్ని పొందుదామని ఆలోచించినా–తన సన్న్యాస దీక్షకు విరుద్ధంగానూ–క్షత్రియపద్ధతికి అనుగుణంగానూ యుద్ధాలు చేసి, రాజ్యాన్ని రక్షించ వలసిఉండడం' అనే ఈ మూడూకూడా 'భీష్ముడు' అనే పేరులోని 'భీష్మ' పదానికి అర్థాలన్నమాట. తండ్రిపెళ్లి జరిపించాడు– భీష్ముడు. చిత్రాంగదుడూ, విచిత్రవీర్యుడనే ఇద్దరు పుత్రుల్ని కన్నాడు– తండ్రి. ఇక ఇంతటితో ఈ సమస్య విడిపోయిందిగదా! అనుకునేంతలోనే చిత్రాంగదుడు గంధర్వులతో యుద్ధం చేస్తూ మరణించాడు.

మిగిలింది – తమ్ముడు విచిత్రవీర్యుడు ఒక్కడే. మళ్లీ భీష్మునిలో ఓవిధమైనభయం ఏర్పడింది.

ఏదైనా జరగరానిది – ఈ విచిత్ర వీర్యునికి జరిగితే, కురువంశం అంతమై పోతుంది. అందుకని కాశీరాజపుత్రికలైన 'అంబ – అంబిక – అంబాలిక' లనే ముగ్గురు రాకుమార్తెలనూ బలవంతంగా నైనా తెచ్చి, విచిత్రవీర్యునితో వివాహం తలపెట్టాడు.

వారిలో పెద్దదైన అంబ, తాను అంతకు ముందే ఒకరిని ఇష్టపడ్డానని చెప్పగానే భీష్ముడు అతనివద్దకు ఆమెను పంపించేశాడు. అతడు తిరస్కరించాడు. దాంతో తనకు ఇక పెళ్లి కానే కాదని భావించిన అంబ, భీష్ముణ్ణే వివాహమాడ వలసిందని ప్రార్థించింది.

తన ప్రతిజ్ఞకు పరీక్షాసమయం – ఒక ప్రాణికి కష్టకాలం– అయిన ఆ సమయంలోనూ తాను ధర్మాన్ని తప్పక, 'పెండ్లాడ' నని ఖండితంగా చెప్పాడు – భీష్ముడు. కురుక్షేత్రయుద్ధంలో శిఖండి రూపాన్ని ధరించి, భీష్ముణ్ణి అస్త్రసన్న్యాసం చేసేలా చేసింది–ఈ అంబయే! యుద్ధంలో తనకు ఎదురుగా ఆమె నిలబడడమంటే, తన అధర్మాన్ని కళ్లకు కట్టినట్టు చూపించడమే అని భావించాడు–భీష్ముడు.

ఈ సమస్య ఇంతటితో తీరిపోయిందని కొంత సంతోషిం చేంతలోనే ధృతరాష్ట్రునిమూర్ఖత్వం, దుర్యోధనునిదుర్మార్గాలూ ఎక్కువైనాయి. పాండవులు లక్కఇంట్లో తగలబడిపోకండా ప్రత్యేక దూతద్వారా వార్త పంపి, పాండవుల్ని తాను రక్షించాడు.

అయితే, అంబవిషయంలో తానొక నేరం చేసి ఉన్నాడు. దానికి పరమాత్మ విధింపబోయే శిక్షకు తోడుగా, దుర్యోధనుణ్ణి హింసిస్తే అది మఱొకనేరమై మళ్లీ తాను శిక్షాపాత్రుడు కావడం ఎందు? కని ఊరకున్నాడు.

విలువిద్య నేర్చుకోబోయేముందు విల్లుపట్టి తాను ప్రతిజ్ఞ చేశాడు– 'ఆడుదాని ఆర్తనాదాన్నీ – అవమానాన్నీ – వినిగానీ, చూస్తూగానీ ఊరికే ఉండను' అని. అయితే ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్టంలో మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది – తనకు.

జూదంవరకూ అవకాశాన్ని ఇచ్చినతర్వాత, ఇంకెంతటి అకృత్యానికైనా పాల్పడతాడు తప్ప – ఎవరు, ఏ విధానంలో చెప్పినా వినని మూర్ఖుడు – దుర్యోధనుడు. కాబట్టి ధృతరాష్ట్రుడు చెప్ప(లే)డు. చెప్పి ప్రయోజనం లేదు. చెప్తే ప్రయోజనం ఉండేదేమో అనుకునే వీలూ లేదు. కారణం, జూదాన్ని ఇంతటితో ఆపించవలసిందని పనిగట్టుకుని విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పినప్పుడు, విదురుని మాట చెల్లుబడి కానే (కా) లేదు కాబట్టి.

ఇలాంటి, ధర్మసంకటపరిస్థితిలో ధర్మనిర్ణయం చేయగల ధర్మ రాజు, కౌరవులకు బందీగా ఉండి, న్యాయాధికారిపదవికి అన ర్హుడయ్యిన్నాడు. అదీ కాక, జూదంలో ఓడి, ముద్దాయిగా ఉన్న తాను, ధర్మశాస్త్రవేత్త అయినా ధర్మనిర్ణయాన్ని చెప్పరాదుకూడా!

తండ్రిమాటను గౌరవించక పోయినా – గురువును లక్ష్యపెట్టే శిష్యులుండవచ్చనే ఉద్దేశంతో–ద్రోణునితో ఈ అకృత్యానికి అడ్డుకట్ట వేయించవచ్చా? అని ఆలోచించాడు – భీష్ముడు. దుర్యోధనునికి గురుభక్తి ఏ మాత్రమూ లేదని తెలిసీ– ద్రోణునిశిష్యుడైన అర్జునుని కారణంగా అర్జునశత్రువైనకర్ణుడు దుర్యోధనుణ్ణి అకృత్యం వైపే నడిపిస్తాడని తెలిసీ మౌనంగానే ఉండిపోయాడు– భీష్ముడు.

ప్రయత్నం చేసినా చేయకపోయినా తన సమక్షంలో వస్త్రాప హరణం జరిగినందుకు ఆ తప్పులో తానూ భాగస్వామే అయి, పరమాత్మ విధించబోయే మరొక శిక్షక్కూడా పాత్రుణ్ణి అయ్యానని భావిస్తూ దుఃఖపడ్డాడు– భీష్ముడు.

ఉత్తరగోగ్రహణానికి వెళ్లినసందర్భంలో వీరుడైన అర్జునుని బాణాల ధాటికి ఆగలేక అవమానంపాలై అంతా వెనుదిరిగి వచ్చేవేళ, దుర్యోధనునికి అజ్ఞాతవాసంలెక్క స్పష్టంగా చెప్తూ, అజ్ఞాతవాస సమయం కిందటిరోజుతోనే ముగిసిందని తేల్చి చెప్పాడు–భీష్ముడు.

దీంతో భీష్మునికి 'పాండవపక్షపాతి' అనే ముద్ర వేసాడు– దుర్యోధనుడు. అయినా ధర్మాన్ని వీడరాదనుకున్నాడు – భీష్ముడు. చిట్టచివరివరకూ తనశక్తిమేఱకు ఎంత ప్రయత్నించినా కురుక్షేత్ర యుద్ధం ఆగలేదు. దుర్యోధనునిది ఆర్థికదృష్టి అయితే, భీష్మునిది పారమార్థికదృష్టి అయింది. శిఖండి కనపడగానే అస్త్రసన్న్యాసం చేసి, అంపశయ్యమీదికి చేరాడు– తాను.

చివరిమాటలు

మౌనధ్యానాన్ని చేస్తూ–కళ్లు మూసుకుని అంపశయ్య మీద ఉన్న భీష్మునివద్దకు పాండవులూ, కృష్ణుడూ, ఇంకా ఎందఱెందరో మహర్షులూ వచ్చి చేరారు. తెల్లనిగడ్డంతో, నుదుట ఊర్ధ్వపుండ్రంతో యోగిపుంగవుడిలా దర్శనమిస్తున్న అనుభవాలముద్ద–భీష్ముడు, కృష్ణునిఅడుగులచప్పుడు విని, వికసిస్తున్న కమల పత్రాల్లా మెల మెల్లగా తన కళ్లు విప్పి, కమలనయనుణ్ణి దర్శించాడు.

మఱికొంతసేపటిలో ఇహలోకబంధాలను తెంచుకోబోతున్న భీష్ముడు, తన చివరినమస్కారాన్ని అలా అంపశయ్యమీద నుంచే– కృతజ్ఞతతోనూ – తప్పులు చేసి ఉంటే మన్నించవలసిందనే భయ వినయాలతోనూ – మరణకాలంలో భగవంతుడు వచ్చి, దర్శనం ఇస్తున్నాడనే ఆనందాతిశయంతోనూ– చేతులు మోడ్చి నమస్కరించి, శ్రీకృష్ణుణ్ణి భక్తితో ప్రీతిపూర్వకంగా చూచాడు.

యుద్ధరంగంలోనే అంపశయ్య మీద పరుండిన కారణంగా–మరణించిన సైనికుల భార్యల ఆక్రందనలూ– యుద్ధంవల్ల తాము అనాథలైన కారణంగా క్షత్రియవంశా లను తిట్టిన తిట్లూ – చేతులూ కాళ్లూ తెగిపడిన సైనికుల హాహాకారాలూ – పిశాచాల అరుపులూ – రాబందుల, గ్రద్దల రాకపోకల చప్పుళ్లూ, ఎండిన నెత్తుటిదుర్వా సనలూ.. ఇలా ప్రత్యక్షనరకాలైన ఇన్నింటినీ నిస్సహాయుడై భరించాడు – భీష్ముడు.

తాను తెలిసో తెలియకో చేసిననేరాలకు శిక్ష ఇదే! ఆకారణం గానే శిక్ష పూర్తి కాగానే వాసుదేవుడు వచ్చాడని గమనించాడు. ఆయన్ను దర్శిస్తున్నందుకు కలిగిన ఆనందంతో భీష్ముని శరీరం నిండిపోయి, ఇంకా మిగిలిన ఆనందానికి శరీరం పట్టలేదు. మెల్లగా పెదవి విప్పాడు. చేతులు జోడించాడు. మాట్లాడ్డం ప్రారంభించాడు.

కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి గగనభాగం బెల్లఁ గప్పి కొనఁగ
ఉఱికిన నోర్వక యుదరంబులో నున్నజగముల వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమున పై నున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నా లావు నగుబాటు సేయకు మన్నించు మని క్రీడి మఱలఁ దిగువ



భోజనం ఉచితం

తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తులకు ఉచితభోజన సదుపాయం ఉంది.

కరికి లంఘించు సింహంబుకరణి మెఱసి, నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు విడువు మర్జున! యంచు మద్విశిఖవృష్టిఁ దెరలి చనుదెంచు కృష్ణుండు దిక్కు నాకు.

'వాసుదేవా! ఆయుధాన్ని పట్టనని నువ్వూ - పట్టించి నీ దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించి, ఆ సుదర్శనచక్రం కారణంగా ఈ శరీరాన్ని అంతమొందించుకోవాలని నేనూ- కురుక్షేత్రయుద్ధం చేస్తూంటే ఆ సందర్భంలో ఎంతచిత్రం జరిగిందయ్యా!

తల్లికీ- పిల్లవానికీ పట్టుదల వస్తే తల్లి దిగొస్తుంది. అది ఆమె లక్షణం-స్వభావమున్నూ. అలాగే నువ్వే చక్రాన్ని పట్టి ఏనుగుమీదికి దూకే సింహంలా నా మీదికి దూకబోతూంటే, కదిలిన నీ కుండలాల కాంతి ఆకాశమంతా ప్రకాశించింది. నీబొజ్జలో ఉన్న లోకాల బరువుకు నేల కదిలింది. వేగంగా దూకబోయిన కారణంగా పైన వేసుకున్న ఉత్తరీయం జారింది. 'నన్ను అవమానపరచవద్దు' అంటూ అర్జునుడు బ్రతిమలాడుతూంటే - 'ఈ రోజు భీష్మణ్ణి చంపి, నిన్ను రక్షిస్తా' నంటూ మీదికి దూకుతున్న ఆ నీ రూపం ఎంత ప్రశాంత మనోహరం స్వామీ! అని ఆ రూపాన్ని మళ్లీ గుర్తుచేసుకున్నాడు- భీష్ముడు.

అదే రూపాన్ని మనసులో ఉంచుకుని మౌనధ్యానం చేస్తూంటే- ఆ కృష్ణుడు తానై స్వయంగా వచ్చాడంటూ ఎన్నెన్నో స్తోత్రాలు చేయడమే కాక - భగవంతునివేయినామాలనూ ఆ భగవంతుని సమక్షంలోనే- తనకు మరణం ఆసన్నమైనకాలంలో- భీష్ముడు ధర్మరాజుకు వినిపించాడు. అవే శ్రీ విష్ణుసహస్రనామా లయ్యాయి. భగవంతుడు స్వయంగా విని, ఆమోదించిన స్తోత్రం అది. మహర్షులు వింటూండగా ధర్మరాజుకు తానై చెప్పాడు-ఆ స్తోత్రాన్ని. ఈ స్తోత్రమే భీష్మునిచివరిమాటలు.

దక్షిణాయనంలో అంపశయ్యమీద పరుండినా, ఉత్తరాయణం వచ్చేవరకూ ఆగి, ఇహలోకశిక్షను తనకు తానే విధించుకుని, తనకు అంత్యకాలంలో తన తప్పుల్ని పరమాత్మ మన్నించడని గమనించి, జీవించి ఉండగానే మోక్షాన్ని పొందిన మహనీయుడు - భీష్ముడు. నిజానికి భీష్ముడు శరీరాన్ని చాలించింది ఏకాదశినాడు కానేకాదు.

శోభకృన్నామసంవత్సరం - మాఘమాసం - శుక్లపక్షం- అష్టమినాడు - రోహిణీనక్షత్రంలో (కృష్ణునిజన్మనక్షత్రం) - మధ్యాహ్నమని తెలుపుతూ సూర్యుడు నడినెత్తిమీద ప్రకాశిస్తూండగా (అభిజిల్లగ్నంలో)- ఆయన పరమాత్మధ్యానంతో, పరమాత్మసమక్షంలో శరీరాన్ని విడిచి, ప్రాణవాయువును నిష్క్రమింపజేశాడు. తల్లి దండ్రులున్నవాళ్లుకూడా భీష్మాష్టమినాడు తర్పణాలు విడవాలని శాస్త్రం చెప్తోంది.

కాబట్టి అష్టమీతిథీ, రోహిణీనక్షత్రం ఉన్న రోజుమాత్రమే 'భీష్మాష్టమి' అవుతుందన్నమాట. ఇలా ఉత్తమంగా మోక్షాన్ని పొందిన కారణంగా, ఈయనపేరిట ఏకాదశిని ఏరర్పరిచారు. కాబట్టి, భీష్మాష్టమికి రెండురోజుల పిమ్మట వచ్చే ఏకాదశి 'భీష్మైకాదశి' అయింది.


రాజఁట ధర్మజుండు - సురరాజసుతుండఁట ధన్వి - శాత్ర వోద్వేజకమైన గాండివము విల్లఁట - సారథి సర్వభద్ర సంయోజకుఁడైన చక్రియఁట - యుగ్రగదాధరుఁడైన భీముఁ డయ్యాజికిఁ దోడు వచ్చునఁట - యాపద గల్గు టిదేమి చోద్యమో!

ధర్మరాజుతో భీష్ముడన్నాడు. 'ధర్మం మూర్తీభవించిన నువ్వు రాజువు. ఇంద్రునిపుత్రుడైన అర్జునుడు నీవెంట ఉండే యోధుడు. శత్రుభయంకరమైన గాండీవం అతని చేతిలోని విల్లు. ఇక రథాన్ని నడిపేది-సర్వలోకాల్నీ పరిపాలించే కృష్ణుడు. తన గదతో భూమండలాన్ని తలకిందులు చేయగల భీముడు యుద్ధంలో నీకు సహాయం చేసేవాడు.

అయినా ధర్మరాజా! నీకు ఆపద కలిగిందంటే- దుఃఖాలు కలిగాయంటే - ఎంతచిత్రం! (భగవంతుడే దీనికి కారణం. కాబట్టి ఆయన తప్ప దుఃఖాన్ని తొలగించగలవాడు లేడు)' అని.

ఉపదేశం

ఇలాంటి పండుగల విశేషాల్ని వింటే- దుఃఖానికి కారణమూ- దానికి నివారణోపాయమూ తెలియడమే కాక-ఎందరో పడ్డకష్టాల ముందు మనదొకకష్టమా? అనే ధైర్యమూ, ఊరటా కలుగుతాయి. జీవితం పురోగమించి, కృతార్థత చేకూర్తుంది.



తిరుమల దర్శనం కంటే ముందు....

తిరుపతి,
శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల
సందర్భంగా...

- జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

సప్తగిరుల్లో భక్తులకు కోరికలను తీరుస్తున్న కల్పవృక్షాలు రెండు ఉన్నాయి. వాటిల్లో మొదటిది ఏడుకొండలపైన ఉంది. రెండవది ఆ కొండలకు కింద ఉంది. మొదటిదాని పేరు 'వాసుదేవ'. రెండవది 'వామదేవ'.

రెండింటిలో 'సుమ' (పుష్పం) భేదం ఉన్నప్పటికీ, ఒకేవిధమైన ఫలాల్ని ప్రసాదించడంలో పోటీపడుతున్న ఈ కల్పవృక్షాల్లో ఒకటి శ్రీవైకుంఠంనుంచి వచ్చి, స్వయంవ్యక్తమై 'వేంకటేశ్వరుడు' అనీ, రెండవది పాతాళంనుంచి స్వయంభువుగా భూమిని చీల్చుకొని పైకి వచ్చి, 'కపిలేశ్వరుడు' అని పిలువబడుతున్నాయి.

సప్తగిరుల క్షేత్రాధిదైవం శ్రీవేంకటేశ్వరుడు! కాగా, ఆ క్షేత్రానికి పాలకుడుమాత్రం కపిలేశ్వరుడు! ఆయనే ఈ కొండమీద 'రుద్రుడు' అని పిలువబడుతున్నాడు.

తిరుమలమీద ఆ కొండలరాయడు వెలసిన గాథ ఎంత అద్భుతమో! కొండక్రింద వేంకటాచలపర్వతగుహలో శ్రీ కామాక్షీ సహిత కపిలేశ్వరస్వామి స్వయంభువుగా ఆవిర్భవించిన గాథ అంతకంటె ఆశ్చర్యకరం!



తిరుపతినుంచి తిరుమలకు వెళ్లే మార్గంలో బస్టాండుకు 3 కిలోమీటర్ల దూరంలో, తిరుమల పర్వతం పైనుండి జాలువారే నయనమనోహరమైన జలపాతంతో విరాజిల్లుతున్న సుప్రసిద్ధమైన శైవ గుహాలయ క్షేత్రం కపిలతీర్థం.

భగీరథుని తపఃఫలంగా దివినుండి భువికి, అక్కడనుండి పాతాళలోకానికి ప్రవహించిన గంగ, భూలోకంలో 'భాగీరథీ గంగ'గా, పాతాళంలో 'భోగవతీ గంగ' గా ప్రసిద్ధికెక్కింది.

ఆ భోగవతీగంగ పక్కనే కపిలమహర్షి తన ఆశ్రమంలో అద్భుతమైన ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించి, ఆరాధించేవాడు. ఆ అద్భుతశివలింగం, రోజురోజుకు వింత వింత తేజస్సులతో ప్రకాశించడంతోపాటు, ఊర్ధ్వముఖంగా పెరుగుతూ పెరుగుతూ, భూమిని చీల్చుకొని, వేంకటాచలక్షేత్రమూలంలో పర్వతగుహలో స్వయంభువుగా వెలసింది. ఆ శివలింగం ఇంకా పెరగకుండా చెయ్యాలని శ్రీమహావిష్ణువు గోపాలకుడై రక్షిస్తుండగా, బ్రహ్మదేవుడు

'కపిలధేనువై' 'మావర్ధస్వ, మావర్ధస్వ' 'చాలు చాలు ఇక పెరగవద్దు' అంటూ క్షీరంతో అభిషేకించాడు. అంతే ఆ లింగం పెరగడం ఆగి పోయింది.

కపిల మహాముని పూజించిన శివలింగం కనుక 'కపిలేశ్వర లింగం' అనీ, 'కపిలేశ్వరుడు' అని పేర్లు ఏర్పడ్డాయి.

అలా పెరుగుతూ వచ్చిన శివలింగంతోపాటు పాతాళంలో పక్కనేవున్న 'భోగవతీ గంగ' కూడ పైకి పెల్లుబికింది. అదే 'కపిలతీర్థం' పేరుతో పరమపావనమైన పుణ్యతీర్థంగా ప్రసిద్ధికెక్కింది. వేంకటాచల పర్వతసానువులనుండి జాలువారే జలపాతంలో శక్రతీర్థం (ఇంద్ర) విష్వక్సేనతీర్థం, పంచాయుధతీర్థాలు, అనలతీర్థం, బ్రహ్మతీర్థం, సప్తర్షి తీర్థాలు – ఇలా 16 తీర్థాలు కపిలతీర్థంతో కలిపి మొత్తం 17 తీర్థాలు అన్నీ భక్తులను పాపాలనుండి విముక్తుల్ని చేసి, పునీతుల్ని చేస్తున్నాయి. ఇవిగాక కపిలతీర్థపుష్కరిణికి నైరుతిలో 'త్రిమూర్తుల తీర్థాలు' అనే మూడు పుణ్యతీర్థాలు కలవడంతో అనేకపుణ్యతీర్థాల సంగమమై ఉంటూ భక్తుల ఘోరకల్మషాలను పోగొడుతున్నది–ఇష్టార్థాలను ప్రసాది స్తున్నది– ఈ కపిలతీర్థం!

కృతయుగంలోని శ్రీకపిలేశ్వరమహాలింగాన్ని, త్రేతాయుగంలో అగ్నిదేవుడు పూజించినందువల్ల 'ఆగ్నేయలింగం' అని పిలువబడింది. ద్వాపరయుగంలో సుదర్శనుడు పూజించిన ఈ శివలింగం కిందిభాగం రజతవర్ణంతోను, మధ్యలో సువర్ణకాంతులతోను, అగ్రభాగం తామ్ర వర్ణంతోను దర్శనమిస్తుంటుంది. అంతేగాక, స్వయంభువైన ఈ శివలింగం పశ్చిమ, ఉత్తర, తూర్పు, దక్షిణ, ఊర్ధ్వదిక్కుల్లో పంచముఖాలతో విరాజిల్లుతూ 'పంచముఖేశ్వరుడు'గా కూడా పిలువ బడుతున్నాడు. ముఖ్యంగా, కపిలేశ్వరుడు పశ్చిమాభిముఖంతో, మూడు కన్నులతో గంభీరంగా దర్శనమిస్తూ, కోరికలను వెంటనే ప్రసాదిస్తున్న 'సద్యోజాతమూర్తి' గా పేరొందినాడు.

ఈ గుహాలయంలో స్వయంభువుగా వెలసిన శ్రీ కపిలేశ్వర స్వామివారితోపాటు, ఆయన దేవేరి శ్రీ కామాక్షీదేవి (పార్వతీదేవి), శ్రీసిద్ధి వినాయకస్వామి, శ్రీవల్లీదేవసేనాసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ దక్షిణామూర్తి, శ్రీ అగస్త్యేశ్వరస్వామి, శ్రీ కోటిలింగేశ్వరస్వామి నవగ్రహదేవతలు, శ్రీ శివసూర్యస్వామి మున్నగు మూలమూర్తులతో పాటు శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ చంద్రశేఖరస్వామి మనోన్మణి, శ్రీ నట రాజస్వామి, శివకామసుందరి, గణపతి, కుమారస్వామి మున్నగు పంచలోహఉత్సవమూర్తులుకూడా చోటుచేసుకున్నాయి.

పూర్వం సుదర్శనుడు ఈ తీర్థంలో తపస్సు చేసినందువల్ల సుదర్శనతీర్థం, చక్రత్తాళ్వారు తీర్థం అని పేరు ఏర్పడింది. ఆ పేరు మరుగున పడిపోగా భగవద్రామానుజులవారు పుష్కరిణికి నాలుగు మూలల్లో సుదర్శన ప్రతిష్ఠచేసి, 'చక్రత్తాళ్వారు తీర్థం' అన్నపేరును ఉద్ధరించారు.

వేంకటాచల క్షేత్రానికి వెళ్లేముందుగా పర్వత మూలంలో ఉన్న కపిలతీర్థంలో పితృతర్పణాది తీర్థవిధు లాచరించి, శ్రీకామాక్షీసమేత కపిలేశ్వరులను దర్శించిన తర్వాతనే తిరుమలకు వెళ్లి 'స్వామిపుష్కరిణి'లో స్నానంచేసి, తొలుత శ్రీవరాహస్వామిని దర్శించి, పిదప శ్రీనివాసుణ్ణి దర్శిస్తేనే తిరుమలయాత్ర పూర్తిగా సిద్ధిస్తుం దని 'శ్రీవేంకటాచల సేవా క్రమం" అనే గ్రంథం స్పష్టం చేస్తోంది.



దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తిలో, పూర్వం 'మాధవు'డనే పండితుడు ఉండేవాడు. సర్వ విద్యావేత్త, అందగాడు అయిన అతనికి 'చంద్రలేఖ' అనే సుగుణాలరాశితో పెళ్లయింది. ప్రారబ్ధకర్మ అన్నట్లుగా ఆ బ్రాహ్మణయువకుడికి 'కుంతలా' అనే వేశ్యతో పరి

చయమయ్యింది. ఆమెవలలో చిక్కుకున్న ఆ విప్రుడు భ్రష్టుడై, తల్లి దండ్రులను, భార్యను వదలేశాడు. పుత్రుని మీది దిగులుతో తల్లి దండ్రులు చనిపోయినా ఆ పాపాత్ముడు వెళ్లలేదు. చివరకు భార్య గతించినా మనసు కరగలేదు. ఇంతటి వ్యామోహంలో ఉన్న మాధవుణ్ణి వేశ్య అసహ్యించుకుంది. అయినా వదలలేదు. విధివశాత్తు ఆ కుంతలకూడా మరణించగా దేశాలు తిరుగుతూ మాధవుడు కపిల తీర్థం చేరుకొన్నాడు. అక్కడ శ్రాద్ధాదికర్మల్ని నిర్వహిస్తున్న ఇతరులను చూచి, తన తల్లి దండ్రులు జ్ఞాపకం వచ్చి పశ్చాత్తాపపడ్డాడు. తన తల్లిదండ్రులకుకూడా మట్టితో పిండప్రదానంచేసి, శ్రీ కామాక్షీకపిలేశ్వరులను సేవించి, అక్కణ్ణుంచి వేంకటాచలం చేరుకొన్నాడు. కడిగిన ముత్యంలా ఉన్న మాధవునికి శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. కపిలతీర్థ స్నానంవల్ల పునీతుడవైన నీవు-వచ్చే జన్మలో ఆకాశరాజుగా జన్మిస్తావనీ, అతనిపుత్రిక పద్మావతితో తనకు వివాహం జరిపిస్తావనీ వరం ఇచ్చాడు.

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామికి వివాహం జరుగునట్లు అనుగ్రహించినస్వామి శ్రీకపిలేశ్వరుడు. శ్రీనివాసుడు తాను ఆకాశరాజుకూతురు పద్మావతిని మోహించానని, పెళ్లిరాయబారం చెయ్యుమని తల్లి వకుళమాతకు చెప్పాడు. కొండల్లో తిరిగే మనమెక్కడ? చక్రవర్తికూతురు పద్మావతి ఎక్కడ? అని తల్లి ప్రశ్నిస్తుంది. అమ్మా! నీవు శ్రీకామాక్షీ సమేత కపిలేశ్వరస్వామిని ప్రార్థించి ఆకాశరాజు దగ్గరికి వెళ్లు. నెరవేరుతుందన్నాడు- వేంకటేశ్వరుడు. కపిలేశ్వరునిఅనుగ్రహం వల్లే ఆకాశరాజు, వకుళమాతకు ఎదురేగి ఆహ్వానించి, శ్రీనివాసునికి పద్మావతిని ఇచ్చి పెళ్లి చేశాడు. వివాహం కావలసినవారు శ్రీకామాక్షీ కపిలేశ్వరులను సేవిస్తే చాలు. తప్పక పెళ్ళి అవుతుంది. వేంకటాచల క్షేత్రం ఎంత ప్రాచీనక్షేత్రమో అంతకంటె ప్రాచీనమైనక్షేత్రం 'కపిలతీర్థం'మని "శ్రీవేంకటాచలమాహాత్మ్యం" తెలుపుతోంది.

శ్రాద్ధాదుల్ని నిర్లక్ష్యం చేసినవారు, మరచి పోయినవారు, పితృదేవతల శాపాలకు గురి అయి, అష్టకష్టాలుపడుతున్నవారు "కపిలతీర్థం"లో తీర్థవిధులు ఆచరించి, తిరుమలయాత్ర చేస్తే చాలు. దోషాలు పోయి, కోరికలు తీరుతాయని కపిలతీర్థస్థలపురాణం తెలుపుతోంది.

ఇంతటి మహిమాన్వితమైన కపిలతీర్థం నిత్యమూ అభిషేకాలతో, అర్చనాదులతో, నవగ్రహశాంతులతో కల్యాణోత్సవాలతో, లక్ష బిల్వఅర్చనలతో, కార్తికమాసంలో విశేషహోమాలతో, మాఘమాసంలో



మహాశివరాత్రి బ్రహోత్సవాలతో, దేవీనవరాత్రి ఉత్సవాలతో సందడిగా ఉన్న ఈ క్షేత్రంలో శ్రీకామాక్షీకపిలేశ్వరస్వామివార్లతో పాటు-ఈక్షేత్ర ప్రాంగణంలో శ్రీలక్ష్మీనారాయణులు, శ్రీరుక్మిణీసత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామివారి సన్నిధులుకూడా ఉన్నాయి. కపిలతీర్థానికి పడమటి ఒడ్డున పర్వతగుహలో ప్రాచీనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రం ప్రవేశద్వారంలో, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం, దానివెనుక, శ్రీనమ్మాళువారలగుడి కూడా ఉన్నాయి.

ఇలా శైవవైష్ణవాలయాల సమ్మిశ్రితమై అత్యంత మహిమాన్వితంగా వెలుగుతున్న తీర్థరాజం, అత్యంత ప్రాచీనమైన క్షేత్రం కపిలతీర్థం. ఇక్కడ ప్రతిసంవత్సరం మాఘమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మహాశివరాత్రి నాటిరాత్రి లింగోద్భవకాలంలో నాలుగుజాముల్లో కూడా మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు, అదేరోజు తిరుమల క్షేత్రంలో క్షేత్రపాలకుడైన రుద్రునికి అభిషేకాలు జరపడం మరో విశేషం!

వేంకటాచలక్షేత్రంలో క్షేత్రపాలకుడైన రుద్రుడు,
కొండ క్రింద శ్రీవేంకటేశ్వరునికి వివాహం చేయించిన,
కల్యాణప్రదాత శ్రీకపిలేశ్వరుడే!


భక్తులను కూడా పాపవిముక్తుల్ని చేసి సర్వాభీష్టాలను నెరవేరుస్తున్న శ్రీకామాక్షీకపిలేశ్వరులను తిరుమల యాత్రికులు విధిగా దర్శించి, తమయాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకుందురు గాక!!

సందర్భం

ముక్కర బోధించిన ముక్తి మార్గం!

– డా॥ సి. శైలకుమార్

ఫిబ్రవరి, 8
పురందరదాసు ఆరాధనోత్సవం సందర్భంగా...



దాససాహిత్యానికి విస్తృతప్రాచుర్యం కలిగించిన వ్యాసరాయలవారి ఉపదేశాన్నీ, సంప్రదాయాన్నీ చక్కగా అనుసరిస్తూ దాససాహిత్యానికి, కర్ణాటకసంగీతానికీ సోపానాలు నిర్మించినవారు – పురందరదాసులవారు. వ్యాసరాయస్వామివారి ప్రియశిష్యులైన పురందరదాసు 1484–1565 మధ్యకాలంలో జీవించాడు.

ఐశ్వర్యవంతుడు త్యాగిగా మారి,యోగి అయిన గొప్పతనం ఈయనజీవితంలో సాక్షాత్కారిస్తుంది. జీవితంలో జరిగిన చిన్నసంఘటన పురందరదాసు జీవితవిధానాన్ని మార్చేసింది. భక్తిజీవితానికి అంకురార్పణ చేసింది. కర్ణాటక సంగీతరంగానికే పితామహుణ్ణి చేసింది.

ఏడుకొండలవాని అనుగ్రహంతో జన్మించిన బిడ్డకు శ్రీనివాసనాయకుడని పేరు పెట్టి 'శీనప్ప' అని ముద్దుగా పిలిచేవారు. ఉద్దండులైన పండితులవద్ద సంగీతంతో పాటు సంస్కృతాన్నికూడా అభ్యసించి, 16 ఏళ్ళకే మంచి పాండిత్యం గడించాడు. ఈ వయస్సులోనే సరస్వతీబాయితో వివాహం జరిగింది. తండ్రి మరణంతో వ్యాపారనిర్వహణ బాధ్యతను స్వీకరించిన శీనప్ప కొద్దికాలంలోనే ఆస్తిని పదింతలు పెంచి 'నవకోటినారాయణు'డనిపించుకున్నాడు. కానీ లోభగుణాన్ని కూడా పెంచుకొని, పరమపిసినారిగా పేరు తెచ్చుకున్నాడు. లోభి అయిన అతనిమనసు దానధర్మాల నుండి బహుదూరమైపోయింది.

'వైకుంఠం వా పరిత్యక్ష్యే న భక్తాన్ త్యక్తు ముత్సహే' అని కదా స్వామివారిసంకల్పం! కనుక భగవంతుడు ఆయనకు గుణపాఠం నేర్పి, మంచిమనసును ప్రసాదించాలని సంకల్పించాడు. భగవంతుడు తలచుకుంటే అవతారాలకేమి కొదువ? తాను వృద్ధబ్రాహ్మణవేషం ధరించి, బ్రహ్మను కుమారునిగా చేసుకుని, అతని ఉపనయనంనిమిత్తం విరాళం ఇవ్వ మని కోరాడు. ఇచ్చే ఉద్దేశం లేని శీనప్ప అతణ్ణి మర్నాడు

రమ్మన్నాడు. ఇలా ఎన్నిరోజులు తిరిగినా ఇదే సమాధానం రావడంతో ఆ బ్రాహ్మణుడు సరస్వతీబాయివద్దకు వెళ్లి యాచించాడు. సహజంగా దానగుణం గల సరస్వతీబాయి, తన భర్త ప్రేమ కానుకగా ఇచ్చిన ముక్కరను బ్రాహ్మణునికిచ్చి, దాన్ని అమ్మి, సొమ్ము చేసుకొని ఉపనయనం జరిపించమని చెప్పి పంపింది. కపటనాటకసూత్రధారి అయిన స్వామి ఆ ముక్కర తీసుకుని వెళ్లి, శీనప్పకే అమ్మజూపాడు. శీనప్ప ఆరితేరిన రత్నాలవ్యాపారి కనుక, ఆ ముక్కరకు ఉన్న రత్నాన్నిబట్టి ఆ ముక్కర తన భార్యదేనని గ్రహించాడు. దాంతో ఆ బ్రాహ్మణుణ్ణి అక్కడే నిలబెట్టి, వెంటనే ఇంటికి వచ్చి, తన భార్యను ముక్కర తెమ్మని ఆజ్ఞాపించాడు. దిక్కుతోచని సరస్వతీబాయి తన భర్త ఎక్కడ ఆగ్రహిస్తాడోనని భయపడి, ప్రాణత్యాగం చేయాలని నిర్ణయించుకుంది. ఆక్షణంలో ఆర్తత్రాణపరాయణుడైన ఆ శ్రీహరి సరస్వతీబాయికి ముక్కరనిచ్చి ఆపద గట్టెక్కించాడు.

ఆమె ఆ ముక్కరను శీనప్పకు ఇచ్చింది. ఆయన ఆశ్చర్యంతో దైవమాయ అని గ్రహించి, ఆ క్షణంనుంచే తన మనోమాలిన్యాన్ని ప్రక్షాళన చేసుకున్నాడు. అతనికి కొత్తజన్మ ఎత్తినట్లయింది. పశ్చాత్తాపహృదయంతో వైరాగ్యాన్ని అలవరచుకుని, అంతవరకు భగవంతునికి, తనకు మధ్య అంతరాన్ని కలిగించిన సంపదను గడ్డిపోచగ ఎంచి, పరిత్యజించాడు. ఈ విషయాన్ని ఆయన –

"ఆదద్దెల్లా ఒళితే ఆయితు... తులసిమాలెయ హాకిసి దళు" అనే కీర్తనలో తెలిపాడు. ఈ పాటలో ఆయన తాను భార్యకారణంగా సన్మార్గప్రవృత్తుడైనట్లుగా, అంతకు పూర్వం 'దాస పంథాన' లేనట్లుగా వ్యక్తం జేశాడు. మొత్తంమీద పురందరదాసులవారిపరివర్తనకు సరస్వతీబాయి ప్రధాన కారకురాలైనది అనే విషయం తెలుస్తున్నది.

ఇతను మొదట వ్రాసిన కృతి చరణంలో–'యౌవనదల్లి శ్రీహరిపాదనంబదే, మూవత్తు వరుష మోహాబ్ధియల్లి బిద్దె' – అంటే యౌవనంలో శ్రీహరిపాదాన్ని విశ్వసించక 30 ఏళ్లు మోహసముద్రంలో పడి మోసపోయానని బాధపడ్డాడు.

నాటినుండి శీనప్ప పదాలు పాడుకొంటూ దేశసంచారం మొదలు పెట్టాడు. క్రీ.శ.1525లో అంటే తన 40వ ఏట ప్రసిద్ధ మధ్వమతగురువులు, మహాపండితులు అయిన వ్యాసరాయస్వామివారినుండి ఉపదేశం పొందారు.

'పురందర విఠల' అనే ముద్రతో కీర్తనలు రచించి, ప్రజలలో భక్తిని ప్రచారం చెయ్యి" అని వ్యాసరాయలు చెప్పి, దీక్షనిచ్చి, మధ్వమతసిద్ధాంతాన్ని ఉపదేశించాడు. హరిదాసు జీవితంలో పాటించాల్సిన పద్ధతుల్ని వివరించాడు. వ్యాసరాయలు అతనికి దీక్ష ఇచ్చింది మొదలుకొని శ్రీనివాసునికి 'పురందర దాసన్న' పేరు వచ్చింది. పురందరదాసుగా ప్రఖ్యాతి పొందాడు. దాసజీవితమాధుర్యాన్ని రుచి చూచాడు.

తెలుగు పదకవుల పేర్లు చెప్పగానే మొట్టమొదట అన్నమయ్య గుర్తుకు వచ్చినట్లు–కన్నడదాససాహిత్యం పేరు వినగానే పురందరదాసులవారు మనస్మృతిపథంలో మెదలుతారు. వారు 'పురందర' అన్న ముద్రాంకితంతో నాలుగు లక్షల డెబ్బై అయిదు వేల కీర్తనలను వ్రాసి, పాడినారు.

కన్నడ హరిదాసులకు ముగ్గురుదేవుళ్ళు చాలా ఆప్తులు. ఉడిపి కృష్ణుడు, పండరపురం విఠలుడు, తిరుమల శ్రీనివాసుడు. చాలామంది హరిదాసుల అంకితంలో విఠలుడు చోటు చేసుకున్నాడు. వ్యాసరాయల అంకితం సిరికృష్ణ, వాది రాజలవారిది హయవదన, కనకదాసులవారిది ఆదికేశవ– ఇలాంటి కొన్ని అంకితాలను వదిలితే–శ్రీపాదరాజులవారి కీర్తనల అంకితం రంగవిఠల. అక్కడినుండి ఆధునిక హరిదాసులవరకు చాలామంది విఠలబంధువులే! విజయవిఠల, గోపాలవిఠల, జగన్నాథవిఠల – ఇలా ఉంటాయి – ఆ ముద్రాంకితాలు. ఇదే విధంగా కృష్ణుడూ అంకితంలో ఉన్నాడు అనేది సిరికృష్ణ, భీమేశ కృష్ణలలో చూడవచ్చు. ఇక వేంకటేశుడు 'ప్రసన్నవేంకట' అనే ముద్రలో ఉన్నాడు. ఆ ముద్రగల హరిదాసు ప్రసన్నవేంకట దాసు. ఇలాంటి అంకితాలలో పురందరదాసులవారి కీర్తనల అంకితం 'పురందర విఠల'.

విజయనగరచక్రవర్తులందరూ శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు కావడంవల్ల కన్నడిగులకుకూడా తిరుపతితో అనుబంధం పెరగడానికి వీలైంది. శ్రీకృష్ణదేవరాయలు దాససాహిత్యాన్ని ఆస్వాదిస్తూ హరిదాసులను గౌరవించేవారు.

రాయలవారితో ప్రతిసంవత్సరం బ్రహ్మోత్స వాలకు శ్రీ పురందరదాసులు వచ్చేవారు. బ్రహ్మో త్సవంలో ఊరేగింపులో స్వామిని చక్కగా వర్ణించి కీర్తనలు పాడారు. పురందరదాసులు తిరుపతి పాలకులతో సత్సంబంధాలు కొనసాగించడమే గాకుండా – సంకీర్తనాప్రపంచంలో తమతో కలిసి నడిచే వాగ్గేయకారులతో సంబంధాలు పెంచుకుని, ఆ పరంపరను కొనసాగించారు.

పురందరదాసు తిరుమల శ్రీనివాసుని కన్నడ భాషలోనే గాక సంస్కృతసంకీర్తనల్లోనూ స్తోత్రం చేశారు. ఆయన వాడిన దేశీయపదాల్లో వ్యావ హారికపోకడలతోపాటు జానపదరీతులుగూడా ప్రస్ఫుటమవుతాయి.

లంబోదర లకుమికర....

'కర్ణాటకసంగీతపితామహ' అని పురం దరదాసుకు పేరు. ఇప్పుడుకూడా వారు వ్రాసిన పిళ్ళారి గీతాలతోనే సంగీత శిక్షణ ఆరంభమవుతుంది. "లంబోదర లకుమికర" పాడని, పాడుకోని సంగీతవిద్వాంసులుం టారా? ఆయన రచించి, గానం చేసిన కీర్తన లలో శబ్దరూపంలో, అక్షరరూపంలో హరి అవతరించాడని చెప్పకోవడంలో అతిశ యోక్తి లేదు. అతని పదాలు ప్రామాణికమై ఒప్పతున్నాయి. వేదశాస్త్రపురాణాల్లోని విద్యా వివేకాల్ని, ప్రజ్ఞాప్రాభవాల్ని తన పదాల్లో ప్రక టించారు - పురందరదాసు. ఆయన చెప్పిన వన్నీ, రచించినవన్నీ గుణంలోనూ, మౌలికత లోనూ ఉపనిషత్తుల సారానికి ఏమాత్రం తీసిపోలేదు. ఇది సామాన్య ప్రజలకోసం చేసిన ప్రయత్నం.

అందుకనే పురందరదాసు కీర్తనలను "పురందరోపనిషత్తు" అని వ్యాసరాయల వారే ప్రశంసించారు.

పురందరదాసు రచించిన –

వెంకటాచల నిలయం వైకుంఠపురవాసం ॥ పల్లవి ॥
పంకజనేత్రం పరమపవిత్రం
శంఖచక్రధర చిన్మయరూపం ॥ అను పల్లవి ॥
అంబుజభవవినుతం అగణితగుణధామం
తుంబురు నారద గాన వినోదం
అంబుధిశయనం అగణితనామం ॥1॥
పాహి పాండవపాలం కౌరవమదహరణం
బాహుపరాక్రమఫణిపతిశయనం
అహల్యాశాపవిమోచనచరణం ॥ 2 ॥
సకలవేదవిచారం సర్వజీవినేతారం
మకరకుండలధరమదనగోపాలం
భక్తవిపోషణపురందరవిఠలం ॥ 3 ॥

బ్రహ్మరుద్రాదులచేత కీర్తించబడే భక్తవత్సలుడైన శ్రీవేంకటాచల నివాసుని పురందరదాసులవారు సంస్కృతంలో ఇలా గొప్పగా కీర్తించారు.

తిరుమల శ్రీనివాసునిపై పురందరదాసు స్వాగతగీతాలు రచించారు. ఇవి ఉత్సవసందర్భంలో స్వామి తిరువీథులలో రమ్మని కోరుతూ పాడడం కావచ్చు, మనోనేత్రాలతో భవ్యవిగ్రహదర్శనాన్ని కోరుతూ కీర్తించడం కావచ్చు. వీటిలో వాత్సల్యంగా 'రారా!' అని పిలుస్తూ కీర్తించేవి కొన్ని, భక్తితో 'రావయ్యా!' అని ఆహ్వానించేవి మరికొన్ని.

అన్నమాచార్యులలాగానే పురందరదాసు నరస్తుతిని వ్యతిరేకించాడు. ఆయన ఎవరిదయాదాక్షిణ్యాలను ఆశించలేదు. ఉన్నసంపదల్ని వదలి, భిక్షాటన చేసి, సంసారం సాగించిన భగవద్భక్తిసంపన్నుడు, నరస్తుతివైముఖ్యాన్ని ఇలా వివరించాడు.

హిందిల్లా స్వామి ముందిల్లా గో
వింద నీనిల్లదె ఇహపరవిల్ల
నరస్తుతిసి నాలిగె బరడాయితల్ల
పరవిన ఇహవిల్ల నరజన్మ స్థిరవల్ల
నరగె పామరగె పాపద పంజరగె ॥ హిందె ॥

ముందూ వెనకా ఏమీ లేదు. గోవిందుడు లేకపోతే ఇహపరాలు లేవు. ఇతరులను స్తుతించడం నాకు చేతగాదు, నరులను స్తుతించే నాలుక

నిస్సారమైనదని అని-ఇలాగా పరిపరి విధాలా నరస్తుతి ఉచితం కాదని కంఠోక్తిగా చెప్పుకున్నాడు- పురందరదాసు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి తిరుమలలో ఆశ్రయం ఇచ్చినవాడు వరాహ స్వామి అని వరాహపురాణాంతర్గత వేంకటాచలమాహాత్మ్యం తెలియజేస్తోంది. పుష్కరిణీస్నానాంతరం ముందుగా వరాహస్వామిని దర్శించుకుని ఆపై తిరుమల శ్రీనివాసుణ్ణి దర్శించాలని పురాణసంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని కూడా పురందరదాసు కీర్తించాడు.

'నిన్న దివ్యమూరుతియ కణ్ణు దణియ నోడి' అనే కీర్తనలో..

ఏనుజన్మద సుకృతఫలవు బందోదగితో
ఈ స్వామి పుష్కరిణి యొళ్
నా స్నానవనుమాడి వరాహ దేవర నోడి
శ్రీస్వామి మహాద్వారకె
ఈ శరీరవను ఈడాడి ప్రదక్షిణె మాడి
లేసినిందలి పొగళుత
ఆ సువర్ణద గరుడ గంబవను సుత్తి సం
తోషదిం కొండాడిదె - బిడదె

- అంటూ పురందరదాసు శ్రీవేంకటేశ్వరదర్శనాను భవాన్ని హృదయంగమంగా వర్ణించాడు.

వీరి కీర్తనలో స్వామి పుష్కరిణిగురించికూడా మనకు తెలియవస్తుంది.

'మంగళం జయమంగళం' అనే కీర్తనలో - 'స్థిరవాగి పుష్కరిణియలి నెలసిహగె, పరతర శ్రీపురందరవిఠలగె' అంటూ స్వామివారిపుష్కరిణిని ప్రస్తావించాడు. ఇలా భూలోకవైకుంఠంగా ప్రసిద్ధి పొందిన తిరుమలను పురందరదాసు వేనోళ్ళ కీర్తించాడు.

హరి సర్వోత్తముడు. ఆత్మనివేదనంతో కూడినభక్తి ముఖ్యం. ముక్తికి భక్తి మూలం. భక్తిలేని ఆడంబరాలు అనవసరమని పురందరదాసువిశ్వాసం. ఈ కలియుగంలో హరిని స్మరిస్తే చాలు - ముక్తి కలుగుతుంది. కాబట్టి ఓ మనసా! హరినామస్మరణ చేసి తరించు అని బోధిస్తాడు. ఇంకా దృఢమైన భక్తి ప్రధానంగాని, స్నాన, జప, తపాదులతో పని లేదంటాడు- పురందరదాసు. భక్తితో పాటు మానవుడు జ్ఞానం సంపాదించా లనీ బోధించాడు. వైరాగ్యాన్ని వివరించాడు. ఇవన్నీ పురందరదాసుపదాల్లో మనం స్పష్టంగా చూడవచ్చు.

విష్ణునివాసం
(యాత్రికుల వసతి సముదాయం)

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తి.తి.దే. తిరుపతిలో నిర్మించిన యాత్రికుల వసతిసముదాయమే విష్ణునివాసం. ఇది తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలో ఉంది.

దంత గళు సడలిదవు ధాతుగళు కుందిదవు
కాంతె యరు జెరెదు ఓ కరినువరో
చింతె యిన్నేతకె బయలాద దేహక్కె
ఇంతెందు శ్రీకాంతన నెనె మనవె

"పండ్లు సడలిపోయాయి. ధాతువుల పటుత్వం తగ్గిపోయింది. స్త్రీలు ముసలితనాన్ని అసహ్యించుకొంటున్నారు. శుష్కించిన దేహానికి చింతయేల? ఓ మనసా! ఇది తెలిసి శ్రీకాంతుని భజించు!" అని అర్థం.

ఇందులో స్వభావోక్తిలో ఎంతో సుందరంగా, సహజంగా ముసలితనాన్ని వైరాగ్యరీతిలో వర్ణించాడు.

మతవైషమ్యాన్ని తొలగించి, సామరస్యాన్ని గూర్చిన మహాపురుషుడు పురందరదాసు. కులమత వర్ణవిభేదాల్ని నిరసించాడు. పరమతసహనం అతనిలోని గొప్పగుణం. తాను మధ్వాచార్యుని ద్వైతమతాన్ని స్వీకరించినా-విశిష్టాద్వైత, అద్వైత మతాలవారితో విరోధించలేదు. శైవులతోసైతం సహనంతో వ్యవహరించిన సహనశీలి. మానవ జీవితాల్ని సముద్ధరించిన మహామహితాత్ముడు- పురందరదాసు. నిత్యస్మరణీయుడు, వాగ్గేయకార ప్రపంచంలో చిరకీర్తిమంతుడు, చరితార్థుడు శ్రీ పురందరదాసు. ●

సందర్భం



కైవల్యమా? కైంకర్యమా?

– డా॥ ముదివేడు ప్రభాకరరావు,
9441872536

భక్తి 'ముక్తి' కోసం ఏర్పడింది. ముక్తి కోరేవాడు ముముక్షువు. ముముక్షుజనులైన మానవులకోసం-శ్రీవైష్ణవసంప్రదాయంలో-"సంసారిచేతనుల" కోసం ఆళ్వారులు చెప్పిన నాలుగువేల పాశురాలే నాలాయిరదివ్యప్రబంధం. ఆళ్వారు అంటే నిరంతరం భగవంతునిభక్తిలో నిమగ్నమైనవాడు.

పన్నెండుమంది ఆళ్వారులలో కాలానుసారం చూస్తే, ఏడవఆళ్వారు కులశేఖర ఆళ్వారు (క్రీ.శ. 700–750). వీరు కేరళదేశంలోని చోళపట్టణమనే పేరుగలకొల్లి (కొల్లం) నగరంలో 28 వ కలియుగంలో పరాభవనామసంవత్సరం, కుంభరాశి, మాసిమాసం, శుక్లపక్షం, ద్వాదశి శుక్రవారం పునర్వసు నక్షత్రంలో, శ్రీమహావిష్ణువుయొక్క కౌస్తుభాంశలో చంద్రవంశరాజకుటుంబంలో జన్మించారు.

శ్రీవైష్ణవసంప్రదాయంలో భగవత్సేవకంటే ఆచార్యసేవ గొప్పది. ఆచార్యసేవకంటే భాగవతసేవ గొప్పది. భగవంతునిభక్తులైన భాగవతులను సేవించుకోవడం చాలా గొప్పదనే గాఢనమ్మకం గలవాడు కులశేఖరఆళ్వారు. ఈ విషయాన్నే శ్రీమద్రామానుజులవారు ఒక తనియన్‌లో ఇలా ప్రశంసించారు. "కులశేఖరఆళ్వార్‌కు శ్రీవైష్ణవులయందుండే గౌరవాదరాలను తుంచివేయాలని ఆయనమంత్రులు ఒక పన్నాగం పన్నారు. కులశేఖరుడు శ్రీరామునిభక్తుడు, ఆ స్వామికి ఆయన నవరత్నహారాన్ని చేయించారు. మంత్రులు ఆ రత్నాలహారాన్ని తీసి దాచిపెట్టి, దాన్ని అర్చకులైన భాగవతులు దొంగిలించారని అభియోగం మోపారు. దానికి కులశేఖరులు, భక్తులైన శ్రీవైష్ణవు లెప్పుడూ దొంగలు కారని నిరూపించడానికై నాగుపాము ఉంచబడిన ఒక కుండలో తన చేతినిపెట్టి, ఆ పాము కాటు వేయక పోవడంచేత మంత్రులకు "కనువిప్పు" కల్గించారు. అటువంటి విలక్షణ భాగవతసేవకుడైన మలయాళదేశప్రభువు – కులశేఖర ఆళ్వారులను సేవిస్తున్నాను" అని రామానుజలవారితనియన్‌సారాంశం.

కులశేఖరఆళ్వారు విలక్షణభక్తుడు. ఈయన మరో రచన **ముకుందమాల–** భక్తులకు నిత్యపారాయణగ్రంథం. నలభైశ్లోకాలలో శ్రీకృష్ణునిపై తమకుగల విశిష్టభక్తిని వెల్లడించారు. శ్రీవైష్ణవులచరమశ్లోకాల్లో ఒకటైన వరాహపురాణశ్లోకం, "స్థితే మనసి సుస్వస్థే......" అనే శ్లోకభావాన్ని తలపించే ఒక్కశ్లోకం చూడండి:

కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాంత మద్యైవ మే విశతు మానసరాజహంసః ।
ప్రాణప్రయాణసమయే కఫవాతపిత్తైః కంఠావరోధనవిధౌ స్మరణం కుత స్తే? ॥

"శ్రీకృష్ణా! నీ పాదకమలమనే పంజరంలో, నా మనస్సనే రాజహంస ఇప్పుడే ప్రవేశించుగాక! ఎందుకంటే ప్రాణావసానసమయంలో వాత, పిత్త, కఫాలతో నిండిన కంఠం నుండి నీ నామం ఉచ్చరించబడజాల నప్పుడు నీ స్మరణ నోరార నేనెట్లు చేయగలను? అందుకే ఇప్పుడే నా మనస్సును నీ పాదపద్మాలకు సమర్పించుకొన్నాను" అన్నారు.

భక్తిభావనలో క్రమికవికాసం

ఆళ్వారులు ఎవరూ ఎవరికీ తీసిపోరు. ప్రతి ఒక్కరిదీ ఒక విశిష్టవిలక్షణభక్తి! ఆధ్యాత్మరామాయణంలో అహల్యాకృతరామస్తవంతో సమానమైంది – కులశేఖరులు శ్రీవేంకటేశ్వరునిపై చెప్పిన పదిపాశురాలసమాహారం. కులశేఖరులభక్తిసూక్తం పదిపాశురాలే! పదకొండవపాశురం ఫలశ్రుతి. ఆయనభక్తిసూత్రం ఒక్కటే! తిరుమల శ్రీవారిసన్నిధిలో

తాను ఏదో ఒకరూపంలో శాశ్వతంగా ఉండి, భాగవతులకు ఉపయోగపడుతూ– స్వామిని సేవించుకోవడం! అది అహంకార, మమకారరహితమైన సాలోక్య, సామీప్యముక్తి! అదే తిరుమలగర్భగృహద్వారంవద్ద గల కులశేఖరప్పడిరహస్యం! భక్తిభావనలో ఉత్తరోత్తరఉత్కర్ష గల కులశేఖరఆళ్వారుకోర్కెలు ఇలా ఉన్నాయి.

పాశుర సంఖ్య	పాశుర చతుర్థపాదం	కోర్కెస్వరూపం
01.	కోనేరి వాళుం కురుకాయ్ ప్పిరప్పేనే! (స్వామిపుష్కరిణిలో ఒక నీటికోడిగా పుట్టరాదా!)	నీటికోడి / వానకోయిల
02.	మీనాయ్ ప్పిఱక్కుం విదియుడై యేనావేనే! (చేపగా పుట్టాలని బ్రహ్మ తలవ్రాత వ్రాయరాదా!)	చేప
03.	పొన్వట్టిఙ్ పిడిత్తుడనే పుగప్పెఱుయేనావేనే! (స్వామిసన్నిధిలో తాంబూలకరండసేవకుడు కారాదా!)	బంటురీతికొలువు
04.	శెణ్బగమాయ్ నిఱ్కుంతిరువుడైయేనావేనే! (సంపంగిచెట్టురూపంతో ఉండే భాగ్యముందా!)	సంపెంగి చెట్టు (తిరుమల స్థలవృక్షం)
05.	తమ్బగమాయ్ నిఱ్కుం తవముడై యేనావేనే! (తంబకవృక్షంగా నిలిచే తపస్సు గలవాడును కారాదా!)	పరిమళం లేని తంబకవృక్షం
06.	అన్ననైయ పొఱ్కువడామరున్తవత్తనావేనే! (సాటిలేని బంగారుకొండగా ఉండేవిధంగా అపురూప తపస్సుగలవాడను కారాదా!)	కొండ
07.	కానాఱాయ్ ప్పాఱుం కరుత్తుడై యేనావేనే! (సెలయేఱుగా పుట్టి, ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా భూమిపై ప్రవహించాలి.)	సెలయేఱు
08.	నెఱియాయ్ క్కిడక్కుం నిలైయుడై యేనావేనే! (శ్రీవైష్ణవపాదధూళి పడేవిధంగా కాలిబాటగా పడియుండరాదా!)	భక్తులు నడిచేకాలిబాట
09.	పడియాయ్ కిడన్దున్ పవళవాయ్ కాణ్బేనే! (స్వామిసన్నిధిద్వారంవద్ద భక్తులు సంచరించే రాతిమెట్టుగా పడియుండి, స్వామిఎఱ్ఱనిపెదవులు చూస్తూ ఉండాలి)	స్వామి సన్నిధిద్వారంవద్ద రాతిమెట్టు (కులశేఖరప్పడి)
10.	ఎమ్బెరుమాన్ పొన్మలై మేలేదేనుమావేనే! (స్వామివారు నెలకొన్న బంగారుకొండపై ఏదో ఒక పదార్థంగా శాశ్వతంగా ఉండిపోవాలి)	తిరుమలకొండపై తాను శ్వాశతంగా నిలిచిపోవాలి. ఇది తీర్మానవాక్యం.
11.	ఫలశ్రుతి ఈ పదిపాశురాలను చక్కగా అధ్యయనం చేసినవారు.....	స్వామిమనస్సుకు నచ్చిన అంతరంగభక్తులవుతారు.

అనేకజన్మల తర్వాత చిట్టచివరకు మానవజన్మ వస్తుంది. కాని, మానవుడు తన సుఖాలకోసం జీవితమంతా వ్యర్థంగా గడిపివేసి, భగవచ్చింతనకోసం, మోక్షప్రాప్తి కోసం పాటుపడవలసిన సమయంలో ఆ మార్గమేమిటో తెలియక– జీవితాన్ని ముగించేస్తున్నాడు. అప్పుడు, చేసినకర్మలనుబట్టి నికృష్టజన్మమో, ప్రకృష్టజన్మమో ఎత్తకతప్పదు. **తెలియలేరు రామ! భక్తిమార్గము** అని త్యాగరాజస్వామివారన్నట్లు, “భక్తిమార్గం” తెలియడంకూడా అంత సులభంకాదు. **మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు కానివారలకు** అంటాడు–త్యాగరాజు. ఆయనకంటే ముందే అన్నమయ్య, **ఊరకే దొరుకునా ఉన్నతమగు మోక్షము** అని ప్రశ్నిస్తున్నాడు. శ్రీవైష్ణవుల మోక్షం అద్వైతులు చెప్పే సాయుజ్యం కాదు. సాయుజ్యమంటే భగవంతునిలో లీనం కావడం. దీనికి భిన్నంగా నిత్యకైంకర్యం చేస్తూ జీవించడం సామీప్య, సాలోక్యముక్తి! శ్రీకులశేఖరులు ఇటువంటి ముక్తినే కోరుకున్నారు! ఆ ముక్తిని సాధించేమార్గంలో ఎటువంటి అల్పమైన రూపాలనైనా ధరించడానికి కూడ ఆయన సంసిద్ధుడైనాడు!

కులశేఖరులది ఒక్కటే నిశ్చితాభిప్రాయం! తాను ఏదో ఒకరూపంలో శాశ్వతంగా తిరుమలగిరిపై స్వామిని చూస్తూ, భక్తులను సేవిస్తూ ఉండిపోవాలి! దానికి అడ్డువచ్చే రాజసఅహంకారాన్ని తాను వదలుకోవడానికి సిద్ధమే! **అహంకారరహితుడైన వాడే నిజమైన వైష్ణవుడు!** భగవద్వియోగంలో నిత్యవిరహుడైన భక్తుడు తాను ఏమైనా ఫరవాలేదనే స్థితికి చేరుకుంటాడు! ఇది నిత్యవిరహిణులైన గోపికలస్థితి! వారుకూడా సామీప్య, సాలోక్యముక్తులనే కోరుకొన్నారు! కులశేఖరులు ‘ఈ జీవుడు పవిత్రుడెలా అవుతా?’డని ప్రశ్నించుకొన్నారు. స్వామిపుష్కరిణి

అత్యంతపవిత్రమైంది! తాను ఆ నీటిలోనే నివసించే ఒక **నీటికోడి**గా మారిపోతే ఎలా ఉంటుందని భావించారు! రోజూ జ్ఞానస్నానమే! అయినా ఆ నీటికోడి ఎంతకాలం జీవిస్తుంది? దానికి జ్ఞానోదయం సంపూర్ణంగా కలిగేదెప్పుడు? పోనీ, **చేప**గా జన్మిస్తేనో? అది నీటిలోనే సదా ఉంటుంది! ఆ విధంగా స్వామికి మరింత చేరువైనట్లు! కాని, ఆ చేపల్ని మానవులు బ్రతకనిస్తారా? అవి అల్పజీవులే!

ఆc! మంచి ఆలోచన వచ్చింది! స్వామివారిసన్నిధిలో వారి బంగారుతాంబూలకరండవాహకుడుగా ఉండిపోతేనో! త్యాగరాజ స్వామివారన్నట్లు, **బంటురీతి కొలువు ఇయ్యవయ్య రామ!** ఈ బంటురీతికొలువే సామీప్య, సాలోక్యముక్తి! ఆ స్థితి లభించడం తనకంత సులభమా! అంత అదృష్టమా!

అవును– అన్నట్టు ఈ తిరుమల **పుష్పమంటపంగా** ప్రసిద్ధికెక్కింది. స్వామి అలంకారప్రియుడు! తాను ఆయన నిత్యాలంకరణకు పనికివచ్చే మంచి సువాసనగల **సంపంగిచెట్టు**గా మారితే! తిరుమల దివ్యదేశంలో సంపంగిచెట్టు స్థలవృక్షం! తాను ఆ వృక్షంగా మారిపోవాలి! అప్పుడు తనకూ స్వామికీ ఎడబాటు ఉండదు! స్వామి ఆలయంచుట్టూ సువాసనలను వెదజల్లుతూ తాను చిరస్థాయిగా నిలిచి పోగలడు! అవును! ఆ వృక్షంమాత్రం శాశ్వతమా! దాన్ని ఎవరైనా నరికివేయవచ్చు! ఎక్కడికో ఆ తోటనే దూరంగా తరలించవచ్చు! అప్పుడు తనముక్తిమాట ఏమౌతుంది?

పరిమళం కలిగినవృక్షమే ఎందుకు? ఎవరికీ ఎందుకూ పనికిరాని వట్టిఆకులచెట్టు **తంబకవృక్షం**గా కొండలో ఏదో ఒక మూల పడి ఉండి మౌనంగా తపస్సు చేస్తున్న మునిలా స్థిరంగా ఉండిపోదామా? ఎలా ఉంటుంది? అయితే నిన్ను ఎవరు గుర్తిస్తారు? ఎవరికీ కాకుండా, ఉపయోగపడకుండా, పనికిరాని ఆ జన్మ ఎందుకు? నీవరకు నీవు ముక్తిసాధిస్తే సరిపోతుందా? అది స్వార్థం కాదా! **ఏకః స్వాదు న భుంజీత** – మధురమైన పదార్థాన్ని నీవొక్కడవే తినరాదు, పదిమందితో కలిసిపంచుకొని తినాలని ఉపనిషత్తు చెప్పడం లేదా! **అహం బ్రహ్మాస్మి** అనుకొనే అద్వైతుల బ్రహ్మానందం కంటే, శ్రీవైష్ణవుల ప్రేమానందం గొప్పది! అది అందరినీ కలుపుకొనిపోయే సేవామార్గం! ఆ ప్రేమమార్గంకోసం ప్రయత్నించు!



పవిత్రమైన చేతులు

– మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఓ సారి తన ఆశ్రమానికి వచ్చిన భక్తులని ఉద్దేశించి ఓ గురువు ప్రసంగించాక అడిగాడు.

"దాహంగా ఉంది. ఎవరైనా నాకు కొంచెం మంచినీళ్ళు తీసుకురండి."

ఓ యువకుడు గ్లాసులో నీటిని తెచ్చి ఇస్తూండగా గురువుకి అతని చేతి వేళ్ళు తగిలాయి.

"నీ వేళ్ళు ఎందుకు ఇంతకోమలంగా ఉన్నాయి?" గురువు అడిగాడు.

"నాకు అనేకమంది పని వాళ్ళు ఉన్నారు. కాబట్టి ఏ పనినీ నేను స్వయంగా చేయాల్సిన అవసరం లేదు." అతను చెప్పాడు.

"ఎప్పుడూ ఎవరికీ సేవ చేయని చేతులు, ఇతరుల సేవలని అందుకునే చేతులు పవిత్రమైనవి ఎలా అవుతాయి? నీ చేత్తో అందించిన నీటిని తాగలేను." గురువు తిరస్కరించాడు.

అతను సిగ్గుపడ్డాడు. తర్వాత అతని నడవడిలో మార్పు వచ్చింది.

అయితే భక్తులందరూ కాలినడకన ఎక్కే ఒక **కొండ**గా నేను మారిపోతే! వారిఉన్నతమైన ఊర్ధ్వగతికి తాను సహాయపడిన వాడనౌతాను! తనమీద కాలుపెట్టి ఆ భాగవతులు నడవడం అనేది అందరికీ లభించేది కాదు. ఆ విధంగా నేను ఒక శాశ్వతతపస్సు చేస్తున్నకొండగా నిలిచిపోతాను. ఈ కొండ సామాన్యమనుకున్నావా! ఇది సాలగ్రామమయమైనకొండ! 'యథా సాలగ్రామమయో హరిః' అని శ్రీ ఆదిశంకరులు చెప్పారు. అట్లే, అన్నమాచార్యుల మనుమడు తాళ్ళపాక తిరువేంగళనాథుడు, తన తాతగారిజీవితచరిత్రలో కూడా, "బాలక! ఈ **పర్వతేంద్రంబు లాలితసకలసాలగ్రామమయము**" అని పద్మావతిఅమ్మవారు బాలకుడైన అన్నమయ్యకు చెప్పడం జరిగింది. తిరుమలకొండ విష్ణుసాలగ్రామం! వట్టి బండ రాయిలాంటి నేను సాలగ్రామమెలా అవుతాను? ప్రజలు సాలగ్రామ శిలనే ఆరాధిస్తారు. వట్టిరాళ్లను నిరాదరిస్తారు. అప్పుడేం చేయాలి?

ఆఁ అన్నట్లు గుర్తుకొచ్చింది! మన వాల్మీకి ఉన్నాడే ఆయన సామాన్యుడు కాదు! రామాయణాన్నిగురించి ఆయన ఒక గొప్పమాట చెప్పాడు! 'ఈ నదులూ, కొండలూ ఉన్నంతకాలం రామకథ ఈ లోకంలో సత్యంగా, శాశ్వతంగా ఉండిపోతుంది'- అని. ఎంత గొప్ప బంగారుకొండగా మారినా, విష్ణుసాలగ్రామంముందు వట్టి కొండరాయి ఎందుకూ పనికిరాదని తేలిపోయింది కదా! ఇక మిగిలింది **నది!** ఆ కొండలనుండి పారే **సెలయేరు**. నేను ఆ సెలయేరుగా మారిపోతేనో! నేను స్వామికీర్తిని గానం చేస్తూ, ప్రవహిస్తూ, జ్ఞానభక్తిపిపాసువుల దప్పిక తీరుస్తూ ఆ విధంగా **మానవసేవ, మాధవసేవ** చేసుకుంటూ శాశ్వతంగా ఉండిపోవాలి! అన్నట్లు-నది, నేలపై ప్రవహించేటప్పుడు తన తొలినాటి స్వచ్ఛతను, పవిత్రతను పోగొట్టుకుని కశ్మలంగా మారుతుంది. చివరికి ఉప్పు నీళ్లయిన సముద్రంలో చేరుతుంది. దానివల్ల ఏం ప్రయోజనం? నేను నా స్వామిని వదలి దూరంగా ఎక్కడికో వెళ్లిపోకూడదు! ఇక్కడే ఈ తిరుమలగిరిపై స్థిరంగా ఉండిపోవాలి! ఆ మార్గమేమిటో ఇంకా తెలియడంలేదే! అయ్యో ఏంచేసేది? ఏది దారి?

ఆఁ దారి అంటే జ్ఞాపకం వచ్చింది! **భక్తులునడిచే దారి!** భక్తులు బాటసారులై నడిచే **కాలిబాట!** అది నిరంతరం శ్రీవైష్ణవుల పాదధూళిచే పరమపవిత్రమైన మోక్షమార్గం! నేను ఆ భక్తులు నడిచే 'కాలిబాట' గా మారిపోతే చాలు! అంతకంటే నాకు కావలసిందేముంది? మరి నా స్వామిని నేనెప్పుడు చూచేది? భక్తులందరూ స్వామిని చూచివచ్చిన సంతోషంతో నా దారిలోనే తిరిగి వెళ్లుతూ, గొప్పగా స్వామిని వర్ణిస్తూ ఉంటే నాకుమాత్రం స్వామిని చూడాలని ఉండదా! నా స్వామిని నేను చూస్తూ, భక్తులను సేవిస్తూ ఉండిపోవాలి! ఆ మార్గమేమిటో! వెతకాలి! అన్వేషించాలి!

ఇలా వెతగ్గా వెతగ్గా చిట్టచివరికి, కులశేఖర ఆళ్వారు అన్వేషణ ఫలించింది! అదే **కులశేఖరప్పడి!**

స్వామిగర్భాలయద్వారంవద్ద గల **రాతిమెట్టు** అధ్యాత్మ రామాయణంలో అహల్య **రాయి**గా మారింది.

శెడియాయవల్ వనైగళ్ తర్కున్తిరుమాలే
నెడియానే! వేంగడమే! నిన్‌కోయిలిన్ వాశల్
అడియారుం వానవరు మరంబైయరుంకిడన్దియంగుమ్ ।
పడియాయ్ కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే ॥

"రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా" అని ఒక ఆధునిక కవిభక్తుడు ఆక్రోశించిన దానికంటే, విలక్షణంగా, కులశేఖరులు తానొక ద్వారబంధం రాతిమెట్టుగా భగవంతుని గుడివాకిట పడి ఉంటే చాలుననుకున్నాడు! అప్పుడు ఆ స్వామిని ఎప్పుడూ చూస్తూ ఉండవచ్చని, ఆయన పగడాలవంటి ఎఱ్ఱనిపెదవుల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఉండిపోవచ్చని. చైతన్యంగల ఆ రాయిలో మనస్సు ఆడుతున్నది కాబట్టి అహంకారం పెరిగే అవకాశముంది. జయవిజయులకే అహంకారం పెరిగి స్వామికి దూరం కాలేదా! చివరికి వైరభక్తితో స్వామిని ఎదిరించి త్వరగా మోక్షాన్ని పొందలేదా! తనలో పుట్టే అహంకారాన్ని భగవంతునిభక్తులే నశింపజేస్తారు. ఆ రాతిమెట్టుగా భక్తులు పాదాలు పెట్టినప్పుడు వారిపాదధూళిచే అహంకారాన్ని పోగొట్టుకొని, క్షణక్షణం పవిత్రమవుతూ ఆవిధంగా, అహంకార మమకారాలు లేనట్టి సాలోక్య, సామీప్యముక్తిని తాను చూర గొనాలని ఉవ్విళ్లూరుతారు- కులశేఖరఆళ్వారు! ఆ విధంగా అయ్యాడు చివరికి! **ఇదే తిరుమలదేవాలయం గర్భగుడిద్వారం లోగల కులశేఖరప్పడిరహస్యం! కులశేఖరుల ముక్తిరహస్యం!**

అద్వైతుల జీవన్ముక్తికంటే- బ్రహ్మానందంకంటే- విలక్షణమైన ప్రేమానందం విశిష్టాద్వైతులది! 'దేవుడ వీవు! జీవుడ నేను!' అని అన్నమయ్య చెప్పిన జీవేశ్వరుల అవినాభావనిత్యసంబంధం!

ఆ నిత్యత్వంలోను - సాయుజ్యం కాకుండా
నిత్యకైంకర్యంతో కూడిన సామీప్య - సాలోక్యముక్తి!

కైవల్యమునకంటె కైంకర్య మెక్కుడు అని అన్నమయ్య చెప్పిన విలక్షణభక్తిమార్గం! ఆ ముక్తిని చూరగొన్న శ్రీ కులశేఖరుల మార్గమే మనకు శరణ్యం! ●

వేటూరివారి.. పరిష్కరణ పథం

– ఆచార్య గల్లా చలపతి,
98858 26626

వేటూరి వారి 128 వ జయంతి సందర్భంగా....



తాళ్లపాక కవులలో ప్రధానుడు, ఆ వంశంవాళ్లను సాత్త్వికులుగా, వైష్ణవులుగా మార్చిన ప్రతిభావంతుడు అయిన అన్నమయ్య వేటూరి ప్రభాకరశాస్త్రిగారిహృదయంలో నిలిచి, తమ రచనలను లోకంలో ప్రచారానికి తెచ్చి, శ్రీనివాసుని కృపకు పాత్రుడవు కమ్మని స్ఫురింపజేసినట్లుంది. ఆ స్పందనతో కాబోలు శాస్త్రిగారు సంకీర్తన వాఙ్మయంతోపాటు ఆ కవుల ఇతర రచనలన్నిటినికూడా పరిష్కరించి, ప్రకటించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ పనితోపాటు తాళ్లపాక కవులనాటి అనేకశిల్పాలను, అపురూపవస్తువులను సేకరించి, ఒక ప్రదర్శనశాలను తి.తి.దే.ద్వారా ఏర్పాటు చేయించాలని, ఆ కవుల రచనలలోని భాషా సాహిత్య సంగీతాంశాల పరిశోధనకు ఒక సంస్థను స్థాపించాలని అనుకొని, ఆ దిశగా గట్టి ప్రయత్నంచేసి, కృతకృత్యు లయ్యారు. ఈ పనులకంటే ముందు తాళ్లపాకకవుల జీవితవిశేషాలను, వాళ్లు రచించిన కృతులను లోకానికి తెలపడం అవసరమని భావించారు. ఆ ప్రయత్నంలో భాగంగా తాళ్లపాక పెదతిరుమలాచార్యుల నాల్గవకుమారుడైన చినతిరువేంగళ నాథుడు అనబడే చిన్నన్న రచించిన 'అన్నమాచార్యజీవితచరిత్ర' ను ప్రకటించారు. **చిన్నన్న తన తాతగారైన అన్నమయ్యను చూచినవాడు కావడంవల్ల ఆయన చెప్పిన అంశాలన్నీ నమ్మదగిన చారిత్రక విషయాలని భావించడానికి వీలుంది. ఈ గ్రంథాన్ని ప్రకటిస్తే తాళ్లపాక కవులకు సంబంధించిన అనేక విషయాలతోపాటు వాళ్లు తిరుమలవాసుని సేవించిన విధానంకూడా లోకానికి విదితమవుతుందని భావించి, శాస్త్రిగారు 1949లో దీనిని తి.తి.దే. ద్వారా ప్రకటింపజేశారు. ఈ గ్రంథాన్ని వేటూరివారు పరిష్కరించిన విధానాన్ని గురించి, దానికి వారు రచించిన పీఠికను గురించి అనేకవిషయాలు తెలుసు కోవలసిన అవసరముంది.**

